

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326


రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 439 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | సోమవారం 21 జూలై 2025 | వెల : 4/-



## తప్పుడు ప్రచారం తగదు

- పాశ్చాత్య మీడియాకు కేంద్ర మంత్రి చురకలు
- విమాన ప్రమాదంపై తుది నివేదిక రాకుండానే వ్యాఖ్యలు చేయడం మంచి పని కాదు
- ఏఏఐబీపై నాకు నమ్మకం ఉంది. బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని డీకోడ్ చేయడంలో ఏఏఐబీ అసాధారణ ప్రతిభ చూపించింది
- దర్యాప్తుపై తుది నివేదిక రాకుండా ఎవరూ ఎలాంటి నిర్ధారణకు రావద్దు'

# వరంగల్‌కు వరాల జల్లు



- వరంగల్‌లో క్రికెట్ స్టేడియం...
- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యేలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు
- యంగ్ స్పోర్ట్స్ స్కూల్ ప్రస్తావన తెచ్చిన శాసనసభ్యులు
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

వరంగల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. వరంగల్‌కు క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేపూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. వరంగల్ అభివృద్ధిపై ఎమ్మెల్యేలు అడిగిన స్పోర్ట్స్ స్కూల్, క్రికెట్ స్టేడియంను తక్షణమే మంజూరు చేశారు సీఎం రేవంత్ రెడ్డి. దీనిపై నేతలు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు. వరంగల్ జిల్లాలో ఆధునిక క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం - మిగతా3లో



## నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి నష్టం జరగవద్దు

- దేశానికి జాతీయ భాష అవసరం లేదు
- హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- జైపూర్ లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్
- హిందీ జాతీయ భాష కాదని, దేశంలో అనేక అధికార భాషలున్నాయని వెల్లడి
- హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ



## 'ఆ టైమ్‌లో కిటికీలు తెరిచే ఉంచొచ్చు'

- విమాన ప్రయాణికులకు డీజీసీఏ వరం
- ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో కిటికీలో నుంచి బయటకు చూడాలనే ప్రయాణికుల ఆశ నెరవేరనున్నది
- విమానాశ్రయాలలో గ్రౌండ్ లేదా ఏరియల్ ఫోటోగ్రఫీపై నిషేధం కొనసాగుతుంది

## నేను డీకే పేరు చెప్పాలా? మీరు నాకు సూచిస్తారా?

సీఎం సిద్ధరామయ్య అసహనం

## సింహవాహిని అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

- గోల్కొండలో మొదలైన ఉత్సవాలు, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వరకు జరుగుతున్నాయి
- బోనాలు ప్రశాంతంగా అత్యంత భక్తి భావంతో కొనసాగుతున్నాయి
- దాదాపు రూ.1290 కోట్లతో దేవాదాయ శాఖకు నిధులు విడుదల చేశామని వెల్లడి



హైదరాబాద్

బోనాలు తెలంగాణ సంస్కృతిలో అనాదిగా కొనసాగుతూ వస్తున్నాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. గోల్కొండలో మొదలైన ఉత్సవాలు, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల వరకు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. ఆదివారం లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారిని మల్లు భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. అమ్మవారికి మంత్రులు మల్లు భట్టి విక్రమార్క - మిగతా3లో



### ఆదిత్య థాకరే, ఫడ్నవిస్ మంతనాలు

## ఊపందుకున్న ఊహాగానాలు

- తాజాగా ఉద్ధవ్ ఠాక్రే, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ మళ్లీ కలుస్తారనే ఊహాగానాలకు తెర
- శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముంబైలోని ఓ హెూటల్‌లో కలుసుకున్నట్టు సమాచారం

## చదువు ఒక్కటే కాదు ఆటపాటలకూ మార్కులు!

- ఇక 360 డిగ్రీల ప్రోగ్రెస్ కార్డు!!
- జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా సమగ్ర అభివృద్ధి పత్రం
- విద్యార్థుల స్థాయి చదువుల్లోనే కాదు క్రీడల్లోనూ
- 24 లక్షల మంది విద్యార్థులకు హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు పంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం




హైదరాబాద్

హెూలి స్టిక్ ప్రోగ్రెస్ కార్డు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి చదువుతున్న సుమారు 24 లక్షల మంది విద్యార్థులకు దీన్ని అందజేసేందుకు రంగం సిద్ధమవుతోంది. విద్యార్థుల స్థాయి చదువుల్లోనే కాదు, క్రీడలు వంటి వాటిలో వారి ప్రతిభ, కుటుంబం, ఆరోగ్యం, వారి లక్ష్యాలు ఇలా సమగ్ర వివరాలను ఈ కార్డులో పొందుపరుస్తారు. దీనిలో 8 నుంచి 10 పేజీలు ఉంటాయి. దీని నమూనాను రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) రూపొందిస్తోంది. దీనిని వచ్చే నెల చివరికల్లా అందించాలని విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. శక్తి సామర్థ్యాలు అంచనా వేసే సమగ్ర ప్రగతి పత్రం : విద్యార్థులు పరీక్షల్లో తెచ్చుకునే మార్కులనే ఇంతవరకూ పరిగణలోకి తీసుకునే వారు. ఇకపై వారి శక్తిసామర్థ్యాలు అంచనా వేసేందుకు 360 డిగ్రీల కోణంలో పరిశీలించి, వారి ప్రగతి కార్డును రూపొందించాలని జాతీయ నూతన విద్యావిధనం-2020 సిఫారసు చేసింది. విద్యార్థుల్లో కొందరు చదువుల్లో ముందుండవచ్చు, మరికొందరికి క్రీడలు, - మిగతా3లో

## పార్టీ కన్నా దేశమే ముఖ్యం'



- మా పార్టీని ఇష్టపడే వారి కోసమే కాకుండా, భారతీయులందరి కోసం మాట్లాడతాను.
- ఎవరైనా సరే పార్టీ ప్రయోజనాల కన్నా దేశానికే ప్రాధాన్యత ఇవ్వాలి
- జాతీయ ఐక్యత అనేది రాజకీయ వైరాన్ని అధిగమించాలి
- 'దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు విభేదాలను పక్కన పెట్టి, భారతదేశం కోసం పనిచేయాలి
- అప్పుడే మనమంతా శాంతియుతంగా జీవించగలం
- కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్

## జస్టిస్ యశ్వంత్ వర్మ తొలగింపునకు ముహూర్తం ఖరారు?



- సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందే జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసన ద్వారా తొలగించే ప్రక్రియపై 100 మంది పార్లమెంట్ సభ్యులు సంతకాలు
- ఇంట్లో కాలిన నోట్ల కట్టలు.. విచారణకు సుప్రీం

# జస్టిస్ యశ్వంత్ వర్మ తొలగింపునకు ముహూర్తం ఖరారు?



**న్యూఢిల్లీ:** కాలిన నోట్ల కట్టల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు పదవి నుంచి ఉద్వాసన పలికే సమయం ఆసన్నమైంది. రేపటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాల ప్రారంభానికి ఒక రోజు ముందే జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసన ద్వారా తొలగించే ప్రక్రియపై 100 మంది పార్లమెంట్ సభ్యులు సంతకాలు పెట్టినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అధికారికంగా ప్రకటించారు.

**ఇంట్లో కాలిన నోట్ల కట్టలు.. విచారణకు సుప్రీం**

ఈ ఏడాది మార్చి నెలలో జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో భారీ ఎత్తున కాలిన నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో జస్టిస్ వర్మపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై సుప్రీం కోర్టు త్రిసభ్య కమిటీతో విచారణ చేపట్టింది. ఈ విచారణలో కాలిన నోట్ల కట్టలు జస్టిస్ యశ్వంత్ వర్మవేనన్న సాక్షులు,ఆధారాలు వెలుగులోకి వచ్చాయి.

**అభిశంసన చర్యలు**

వీటిని పరిగణలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం నియమించిన త్రిసభ్య కమిటీ సైతం జస్టిస్ వర్మను అభిశంసన ద్వారా తొలగించాలని సిఫారసు చేసింది. త్రిసభ్య కమిటీ నిర్ణయాన్ని తప్పుబట్టిన జస్టిస్‌వర్మ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కమిటీ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని అత్యున్నత న్యాయ స్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే తనపై అభిశంసన చర్యలు ప్రారంభించాలంటూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా చేసిన సిఫార్సులను సైతం సవాలు చేశారు.

**త్రిసభ్య కమిటీ రిపోర్టుపై సవాలు**

నోట్ల కట్టల వ్యవహారంలో తన వాదన పూర్తిగా వినకుండానే నివేదిక రూపొందించారని అంతర్గత ఎంక్వైరీ కమిటీ తీరును ఆయన తప్పుపట్టారు. ఈ దర్యాప్తులో లోపాలు ఉన్నాయని స్పష్టం చేశారు. తనకు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాధారాలు కమిటీకి లభించలేదన్నారు.

**ఏకమైన అధికార,ప్రతి పక్షాలు**

తనను దోషిగా తేల్చాలన్న ముందస్తు వ్యూహంతోనే నివేదిక సిద్ధంగా చేశారని విమర్శించారు. తనపై దర్యాప్తు ప్రక్రియ మొత్తం రాజ్యాంగవిరుద్ధంగా సాగిందని, తన ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. నివేదికపై తాను అధికారికంగా స్పందించకముందే దాన్ని మీడియాకు లీక్ చేశానని, తన ప్రతిష్టను దెబ్బతీయాలన్న కుట్ర జరిగిందని జస్టిస్ వర్మ మండిపడ్డారు. అందుకే ఈ నివేదికను రద్దు చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. అయినప్పటికీ జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టేందుకు అధికార,ప్రతి పక్షాలు ఏకమయ్యాయి.

**అభిశంసన తీర్మానం ద్వారా**

భారత రాజ్యాంగం ప్రకారం.. అవినీతి ఆరోపణల ఆధారంగా రాష్ట్రపతి ఉత్తర్వు ద్వారా మాత్రమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని పదవి నుండి తొలగించవచ్చు.అటువంటి ఘటనల్లో అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యుల మద్దతు లేదంటే లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యుల మద్దతు ఉంటేనే ఆమోదిస్తారు. ఈ తీర్మానాన్ని ఆమోదించడానికి సభలోని మూడింట రెండు వంతుల ఎంపీల మద్దతు అవసరం.

**మంత్రి కిరణ్ రిజిజు ఏమన్నారంటే?**

ఇప్పుడు ఇదే పద్దతిలో జస్టిస్ వర్మ తొలగింపునకు అధికార,ప్రతిపక్ష లోక్ సభ,రాజ్య సభ సభ్యులు సంతకాలు పెట్టారు. న్యాయవ్యవస్థలో అవినీతి అనేది చాలా సున్నితమైన విషయం. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉన్నాయి. వర్షాకాల సమావేశంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై ప్రభుత్వం అభిశంసన తీర్మానాన్ని ప్రవేశ పెట్టనున్నాం' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు.

**అభిశంసన తీర్మానంలో అనూహ్య పరిణామం**

ఈ అభిశంసన తీర్మానంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు పరస్పరం విభేదిస్తుంటాయి. కానీ న్యాయవ్యవస్థలో అవినీతి వంటి సున్నితమైన అంశంపై పార్టీలకు అతీతంగా స్పందించడం, ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలుస్తూ.. 100 మంది ఎంపీలు అభిశంసన తీర్మానంపై సంతకాలు చేయడం, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సహా 35 మంది కాంగ్రెస్ ఎంపీలు సైతం సంతాలు చేసినట్లు సమాచారం.

# తప్పుడు ప్రచారం తగదు



**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాద ఘటనపై పాశ్చాత్య మీడియా కథనాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తప్పుపట్టారు. విమాన ప్రమాదంపై తుది నివేదిక రాకుండానే వ్యాఖ్యలు చేయడం మంచి పని కాదని సూచించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో హిండాన్ ఎయిర్‌పోర్ట్ నుంచి తొమ్మిది సిటీలకు ఇండిగో విమాన సర్వీసులను మంత్రి ఆదివారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. 'ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఇప్పటికే పాశ్చాత్య మీడియా సంస్థలకు ఏఏఐబీ విజ్ఞప్తి చేసింది. అయినప్పటికీ స్వప్రయోజనాల కోసం తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. ఏఏఐబీపై నాకు నమ్మకం ఉంది. బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని డీకోడ్ చేయడంలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) అసాధారణ ప్రతిభ చూపించింది. దర్యాప్తుపై తుది నివేదిక రాకుండా ఎవరూ ఎలాంటి నిర్ధారణకు రావద్దు' అని మంత్రి పునరుద్ఘాటించారు. జూన్ 12న జరిగిన ఘోర దుర్ఘటనపై పైలట్ల తప్పదమే ముఖ్య కారణమన్న విధంగా వెస్ట్రన్ మీడియా కథనాలు వెలువరించింది. రెండు ఇంజన్లకూ వెళ్లే ఇంధనాన్ని కంట్రోల్ చేసే స్విచ్‌లను కెప్టెన్ ఆపేసినట్టు ఒక యూఎస్ అధికారిని ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించింది. అయితే, ఈ కథనాన్ని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తోసిపుచ్చింది. అంతర్జాతీయ మీడియాకు చెందిన కొందరు ఎలాంటి నిర్ధారణ లేకుండానే బాధ్యత లేని కథనాలు ప్రచురిస్తున్నారని, దర్యాప్తు కొనసాగుతుండగా ఇలాంటి కథనాలను వ్యాప్తి చేయడం సరికాదని పేర్కొంది. తుది నివేదిక వచ్చేంత వరకూ మీడియా సంస్థలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. బోయింగ్ 787-8 కుప్పకూలిన దుర్ఘటనలో విమానంలోని 241 మందితోపాటు కుప్పకూలిన ప్రదేశంలోని 19మంది మృతిచెందారు. భారతదేశ విమానయాన చరిత్రలోనే ఇది ఘోర దుర్ఘటనగా నిలిచింది.

# మళ్లీ మా నాన్నే సీఎం



**పాట్నా:** త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, తన తండ్రి నితీష్ కుమార్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆయన కుమారుడు నిషాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు నితీష్ ఎంతో చేశారని, ప్రజలు ఎన్డీయేను గెలిపించి మరోసారి ప్రజాసేవ చేసే అవకాశం ఆయన కల్పిస్తారని పాట్నాలో ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ నిషాంత్ చెప్పారు. 'మళ్లీ మా నాన్నగారే సీఎం అవుతారు. ప్రభుత్వాన్ని ఎన్డీయే ఏర్పాటు చేస్తుంది. మేము గట్టి మెజారిటీతో గెలుస్తాం. గత 20 ఏళ్లుగా ఆయన చేసిన సేవలు, పనులకు గుర్తింపుగా మరోసారి నితీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపిస్తారనే నమ్మకం నాకుంది' అని నిశాంత్ తెలిపారు.

**ఈ ఏడాది చివర్లో ఎన్నికలు**

ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందించిన 75 ఏళ్ల నితీష్ కుమార్ మరోసారి అధికారాన్ని ఆశిస్తున్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేలో జేడీయూ, చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ భాగస్వామిగా ఉన్నాయి. ఈసారి నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి గట్టిపోటీని ఎదుర్కొనే అవకాశం ఉంది. తేజస్వి యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్, కాంగ్రెస్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ, వామపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. నితీష్ పాపురాలిటీ తగ్గుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు ఆయన సారథ్యం వహించక పోవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే బీహార్‌లో ఎన్డీయేకు నితీష్ సారథ్యం వహిస్తారని బీజేపీ స్పష్టత ఇచ్చింది. నితీష్ కుమార్ 2013లో ఎన్డీయేను విడిచిపెట్టి తన చిరకాల ప్రత్యర్థి లాలూ ప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపారు. 2017లో ఆర్జేడీని వీడి తిరిగి ఎన్డీయేలోకి వచ్చారు. 2022లో తిరిగి ఎన్డీయేతో తెగతెంపులు చేసుకుని ఆర్జేడీతో కలిసారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మరోసారి ఆయన పీఎం మోదీ క్యాంపులోకి వచ్చిచేరారు.

# 'ఆ టైమ్‌లో కిటికీలు తెరిచే ఉంచొచ్చు'



**న్యూఢిల్లీ:** విమాన ప్రయాణికులకు ఆహ్లాదం కలిగించే వార్త ఇది. ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో కిటికీలో నుంచి బయటకు చూడాలనే ప్రయాణికుల ఆశ నెరవేరనున్నది. భారత వైమానిక దళంలోని జాయింట్ యూజర్ ఎయిర్ పోర్టులలో (జేయూఏఎస్))విమానాలు టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో కిటికీ షేడ్స్‌ను మూసివేసి ఉంచాలనే నిబంధనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)ఉపసంహరించుకుంది.అయితే, విమానాశ్రయాలలో గ్రౌండ్ లేదా ఏరియల్ ఫోటోగ్రఫీపై నిషేధం కొనసాగుతుంది. పలు భద్రతా కారణాల దృష్ట్యా గతంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయంలో కిటికీ షేడ్స్‌ను కిందికి ఉంచాలంటూ డీజీసీఏ అన్ని వాణిజ్య, చార్టర్, ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్లకు సూచించింది. ఈ సూచన ముఖ్యంగా ఇండో-పాక్ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఎయిర్‌బేస్‌లను ఉద్దేశించి చేశారు. ఇప్పుడు ఈ నియమాన్ని సడలించారు. అయితే ఫోటోలు, వీడియోలు తీయడంపై గల నిషేధం భద్రతా కారణాల దృష్ట్యా అలాగే కొనసాగనుంది. ప్రయాణికులు తమ ప్రయాణంలో ఫోటోలు లేదా వీడియోలు తీయకూడదని డీజీసీఏ కోరింది. భారత వైమానిక దళం సూచనల ప్రకారం, భద్రత దృష్ట్యా ఫోటోగ్రఫీపై నిషేధం చాలా ముఖ్యమైనదని డీజీసీఏ స్పష్టం చేసింది. టేకాఫ్, ల్యాండింగ్ లేదా విమానం రన్‌వేపై ఉన్నప్పుడు ప్రయాణికులను ఫోటోలు లేదా వీడియోలు తీయడానికి అనుమతించరు. ఈ నియమం ముఖ్యంగా జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్టులు అని పిలిచే ఐఏఎఫ్ ఎయిర్‌బేస్‌లకు వర్తిస్తుంది. పౌర, సైనిక విమాన కార్యకలాపాలు ఈ విమానాశ్రయాలలో కొనసాగుతాయి. పఠాన్‌కోట్, శ్రీనగర్, ఆగ్రా, బరేలీ, గ్వాలియర్ తదితర ఎయిర్‌బేస్‌లలో ఫోటోగ్రఫీపై నిషేధం వర్తిస్తుంది.

## ఆదిత్య ఠాకరే, ఫడ్నవిస్ మంతనాలు ఊపందుకున్న ఊహాగానాలు



**ముంబై:** మహారాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు కొత్తమీ కాదు. ఠాక్రే సోదరులు కలుస్తారంటూ కొద్దికాలంగా చెలరేగుతున్న ఊహాగానాలు ఇటీవల ఒకే వేదికపై ఉద్ధవ్, రాజ్ ఠాక్రే కలుసుకోవడంతో తెరిపిన పడ్డాయి. అయితే తాజాగా ఉద్ధవ్ ఠాక్రే, సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ మళ్లీ కలుస్తారనే ఊహాగానాలకు తెరలేచింది. ఇందుకు బలం చేకూరుస్తూ ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముంబైలోని ఓ హోటల్‌లో కలుసుకున్నట్టు సమాచారం. తొలుత ఆదిత్య ఠాక్రే శనివారం సాయంత్రం బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని సోఫిటెల్ హోటల్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత కొద్ది సేపటికి హోటల్‌కు ఫడ్నవిస్ వచ్చారు. అక్కడ ఇద్దరు నేతలు 'రహస్య' సమావేశం జరిపినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) మాత్రం ఫడ్నవిస్ హోటల్‌కు వెళ్లడం నిజమేనని, అయితే ఆయన ఆదిత్యను కలుసుకోలేదని తెలిపింది. వేర్వేరు కార్యక్రమాలకు కోసం వారిద్దరూ వచ్చారని, వారిమధ్య ఎలాంటి సమావేశం చోటుచేసుకోలేదని సీఎం కార్యాలయ అధికారి ఒకరు తెలిపారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌తో ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ పొత్తు ఉంది. ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యూబీటీ) విపక్ష మహా వికాస్ అఘాడిలో భాగంగా శరద్‌పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్‌తో పొత్తు కలిగి ఉంది. కాగా, శనివారం సాయంత్రం ఆదిత్య ఠాక్రే, ఫడ్నవిస్ సమావేశం కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చని పలువురు శివసేన (యూబీటీ), బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. బీజేపీ, శివసేన (యూబీటీ) తిరిగి చేతులు కలిపితే అది ఆశ్చర్యకరమైన పరిణామం కాదనీ, 2019లోనూ ఈ పరిణామం జరిగిందని ఎన్‌సీపీ-ఎస్పీ నేత ప్రశాంత్ జగ్‌తప్ తెలిపారు. మహారాష్ట్రలో ఏదైనా జరగవచ్చని, 2019 తర్వాత కూడా అనేక అనూహ్య పరిణామాలను చూశామని చెప్పారు. రెండు పార్టీలు తిరిగి కలవాలని నిర్ణయిస్తే మహారాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోయేదేమీ ఉండదన్నారు. అయితే, శివసేన (యూబీటీ) వర్గం మహా వికాస్ అఘాడితోనే ఉండొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. లేదంటే ప్రజలను వంచించినట్టు అవుతుందని అభిప్రాయపడ్డారు.

**ఫడ్నవిస్ ఆహ్వానం**

ఈ వారం ప్రారంభంలో శాసన మండలిలో అంబాదాస్ దాన్వే ఫేర్‌ఫెల్ సందర్భంగా దేవేంద్ర ఫడ్నవిస్ సైతం ఉద్ధవ్ తమ వైపు వస్తే స్వాగతిస్తామని అన్నారు. 2029 వరకూ తాము అక్కడకు (విపక్షం వైపు) వెళ్లే అవకాశం లేదని, ఉద్ధవ్ ఈవైపు (అధికార పక్షం) వచ్చే విషయం ఆలోచించుకోవచ్చని అన్నారు.

## నేను డీకే పేరు చెప్పాలా? మీరు నాకు సూచిస్తారా?



కర్ణాటక సీఎం మార్పు అంశంపై గత కొన్ని రోజులుగా జోరుగా చర్చ నడుస్తోంది. సీఎం సిద్ధరామయ్యను మార్చే అవకాశం ఉందని, ఆ స్థానంలో డీకే శివకుమార్‌కు అవకాశం కల్పించడానికి రంగం సిద్ధమైందంటూ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. అయితే దీనిపై సిద్ధరామయ్య కానీ, డీకే శివ కుమార్ కానీ ఇప్పటివరకూ ఎటువంటి ప్రకటన చేయలేదు. అయితే నిన్న (శనివారం, జూలై 19వ తేదీన) మైసూర్ జిల్లాలో జరిగిన పార్టీ ఈవెంట్‌లో ప్రభుత్వంలో నెలకొన్న అసంతృప్తిని సీఎం సిద్ధరామయ్య బహిరంగంగానే వెళ్లగక్కారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ప్రసంగంలో ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ పేరును పేర్కొనాలనే సూచనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను కీర్తించే క్రమంలో కొత్త ప్రాజెక్టులను ప్రకటించడంలో భాగంగా ఏర్పాటు చేసిన 'సాధన సమావేశం'లో సీఎం సిద్ధరామయ్య ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు,. అయితే అత్యవసరంగా ఆయన బెంగళూరు బయల్దేరాల్సి ఉండటంతో వేదిక పైనుంచి ఉన్నపళంగా వెళ్లిపోయారు. అయితే సిద్ధరామయ్య ప్రసంగానికి సిద్ధమైన క్రమంలో పార్టీ ముఖ్యులను పరిచయం చేసే క్రమంలో డీకే పేరు ప్రస్తావించలేదు. అయితే డీకే, డీకే, డీకే అంటూ సభకు వచ్చిన జనం నుంచి స్పందన వచ్చింది. దీనిపై సిద్ధరామయ్యలో కోపం కట్టలు తెంచుకుంది. అదే సమయంలో డీకే పేరును మరిచిపోయారనే ఉద్దేశంతో కాంగ్రెస్‌కు చెందిన ఒక న్యాయవాది.. ఆ విషయాన్ని ఆయనకు తెలియజేసే ప్రయత్నం చేశారు. దీంతో సిద్ధరామయ్యకు కోపం మరింత ఎక్కువవైంది. ' డీకే శివకుమార్ ఇక్కడ లేరు.. అవునా.. కాదా.. దయచేసి మీరు వెళ్లి కూర్చోండి. మీరు ఏ తరహా న్యాయవాది' అంటూ కాస్త స్వరం పెంచి మరీ సిద్ధరామయ్య అనడంతో ఇది పార్టీలోని, ప్రభుత్వంలో అంతర్గత లుకలుకల్ని బయటపెట్టింది.

## పార్టీ కన్నా దేశమే ముఖ్యం'



తిరువనంతపురం: 'నేను భారతదేశం గురించి మాట్లాడేటప్పుడు, మా పార్టీని ఇష్టపడే వారి కోసమే కాకుండా, భారతీయులందరి కోసం మాట్లాడతాను. ఎవరైనా సరే పార్టీ ప్రయోజనాల కన్నా దేశానికే ప్రాధాన్యత ఇవ్వాలని' కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ పిలుపునిచ్చారు. ఇందుకు ఉదాహరణగా దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, 'భారతదేశమే నశించిపోతే ఇక ఎవరు బతుకుతారు?' అని ప్రశ్నించారు. జాతీయ ఐక్యత అనేది రాజకీయ వైరాన్ని అధిగమించాలని థరూర్ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ముఖ్యంగా పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, కాంగ్రెస్ చేపడుతున్న దౌత్యపరమైన ప్రచారం, జాతీయవాద వైఖరిపై వస్తున్న విమర్శల నేపథ్యంలో శశి థరూర్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. తిరువనంతపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ 'దేశం ప్రమాదంలో ఉన్నప్పుడు విభేదాలను పక్కన పెట్టి, భారతదేశం కోసం పనిచేయాలి. అప్పుడే మనమంతా శాంతియుతంగా జీవించగలం. నా దృష్టిలో దేశానికే ?తొలి ప్రాధాన్యత.. పార్టీలన్నీ దేశాన్ని మెరుగుపరచడానికి గల సాధనాలు. ఏ పార్టీకి చెందినవారైనా, ఆ పార్టీకి అనుగుణమైన మార్గంలో నడుచుకుంటూ మెరుగైన భారతదేశాన్ని రూపొందించేందుకు కృషిచేయాలి' అని అన్నారు. శశిథరూర్ తనపై వచ్చిన విమర్శలను తిప్పికొడుతూ ఈ విధమైన వ్యాఖ్యానాలు చేశారు. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాక్ ఉగ్రవాద సంబంధాలు, భారత వైఖరిని అమెరికా వంటి దేశాలకు తెలియజేసేందుకు ఏర్పాటైన అఖిలపక్ష ప్రతినిధి బృందానికి శశిథరూర్ నాయకత్వం వహించారు. ఈ సమయంలో ఆయన ప్రసంగాలపై పలు విమర్శలు వచ్చాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పరోక్షంగా థరూర్‌ను లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ పార్టీ దేశానికే ప్రాధాన్యతనిస్తుందని, అయితే కొందరు ముందు ప్రధాని మోదీ, తరువాత దేశం అనే విధంగా వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు.

# చిట్ చాట్ చిటపటలు

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలకు చిట్‌చాట్ మంటలు అంటుకున్నాయి. గంజాయ్ బ్యాచ్ అంటూ అధికారపక్షం విపక్షాన్ని టార్గెట్ చేస్తుంటే? డైవర్ట్ రాజకీయాలు అస్సలొద్దు. దమ్ముంటే నిరూపించూ అంటూ విపక్షం అధికార పార్టీకి సవాల్ విసురుతోంది. అసలే తెలంగాణ రాజకీయాలు బనకచర్ల ఇష్యూతో భగభగ మండుతున్నాయి. ఇప్పుడు అగ్నికి ఆజ్యం అన్నట్లుగా చిట్‌చాట్ చిటపటలు కూడా అంటుకున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ను గంజాయి బ్యాచ్‌తో పోల్చడంతో వివాదం రాజుకుంది.కేటీఆర్ చుట్టూ ఉండే వాళ్లు డ్రగ్స్ తీసుకుంటారని, అతని మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం దుమారం రేపింది. కేటీఆర్ స్నేహితుడు కేదార్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకొని చనిపోయాడని, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను కూడా తెప్పించినట్లు రేవంత్ చెప్పడంతో తెలంగాణ రాజకీయాల్లో అలజడి రేగింది. అంతేకాదు లోకేష్‌ను ఖఖీ ఎందుకు రహస్యంగా కలిశారో చెప్పాలన్నారు రేవంత్. అర్ధరాత్రి లోకేష్‌తో డిన్నర్ మీటింగ్‌లు ఎందుకు చేశారని సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు రేవంత్మరోవైపు రేవంత్ రెడ్డి చిట్ చాట్ మాటలపై బీఆర్ఎస్ మండిపడింది. గంజాయి బ్యాచ్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ సవాల్ విసిరారు కేటీఆర్. డ్రగ్స్ కేసులు ఉంటే చూపించాలని, లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమన్నారు కేటీఆర్. గతంలోతాను చేసిన వైట్ చాలెంజ్‌కు..రేవంతే పారిపోయాడని? అసత్య ఆరోపణలతో రేవంత్ ప్రజాసమస్యలను డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు కేటీఆర్మరోవైపు మాజీ మంత్రి హరీష్ రావు రేవంత్ రెడ్డి చిట్‌చాట్ వ్యాఖ్యలపై తీవ్రంగా ధ్వజమెత్తారు. రేవంత్ బూతులతో ఢిల్లీ కాలుష్యం పెరిగిందని, కేటీఆర్ రాష్ట్ర




గౌరవాన్ని అంతర్జాతీయంగా పెంచితే..సీఎం రేవంత్ బ్యాగ్‌లు మోసి తెలంగాణ పరువు తీసారంటూ విమర్శించారు. రేవంత్‌కు కంపల్సివ్ లై సిండ్రోమ్ ఉందని, రహస్య మంతనాలు రేవంత్‌కే సాధ్యమని విమర్శించారు. రేవంత్ బనకచర్లపై అడ్డంగా దొరికిపోయాడని, చర్చ జరిగిందని కేంద్ర మంత్రి నిమ్మల చెబుతుంటే? రేవంత్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు హరీశ్.రేవంత్ రెడ్డి చిట్‌చాట్ మంటలు తెలుగు రాష్ట్రాల రాజకీయాలను మరింత హీటెక్కించాయి. కేటీఆర్, లోకేష్ రహస్య సమావేశాల ఆరోపణలు బీఆర్ఎస్, టీడీపీ మధ్య సంబంధాలను హైలెట్ చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా? బనకచర్లపై తెలంగాణ సమాజాన్ని రేవంత్ తప్పుదోవ పట్టించేప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రివర్స్ అటాక్‌కు దిగుతోంది. మొత్తానికి చిట్‌చాట్ రగడ తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తోంది.

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిచ్చే పంట

# రైతులకు ఉచితంగా మొక్కలు సరఫరా

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతన్నలు దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. అందుకనుగుణంగా వ్యవసాయ అధికారులు సరికొత్త వంగడాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వెదురు మొక్కల్లో కొత్త రకం వంగడాలను (విత్తనాలు) అందుబాటులోకి తెచ్చి సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ఫర్ ఫ్రూట్స్) సిద్ధం చేసింది. తక్కువ కాలంలోనే ఏళ్ల తరబడి ఆదాయాన్ని అందించే మొక్కలను రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

త్రిపుర నుంచి విత్తనాలు : తెలంగాణ రాష్ట్ర ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు కొత్త రకం వెదురు మొక్కలను అందించాలని సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం త్రిపుర రాష్ట్రం నుంచి శాస్త్రవేత్తల రిసెర్చ్? అనంతరం వెదురు వంగడాలను ఉద్యాన శాఖ అధికారులు తీసుకువచ్చారు. మొక్కలను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రైతులకు ఎటువంటి చింతాలేకుండా ఉచితంగా సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. కావాలనుకునే రైతులు ఆయా జిల్లాలకు చెందిన ఉద్యానవన శాఖ అధికారులతో ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాల్సి ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి ఆశిష్ వెల్లడించారు. వీటి పంపిణీ వచ్చే నెల ఆగస్టులో ఉంటుందని తెలిపారు. మొదటి మూడు సంవత్సరాల పాటు అంతర పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

"వెదురు మొక్కల కొత్త రకాలతో ఎన్నో రకాల



ప్రయోజనాలున్నాయి. ఒక్కో చెట్టు నుంచి ప్రతి సంవత్సరం 5 వరకు కొత్త కర్రలు (బొంగులు) వస్తాయి. ఎత్తు 25 అడుగుల వరకు ఉంటుంది. కర్ర మధ్యలో రంధ్రాలు ఉండవు. ఎటువంటి ముళ్లు ఉండవు. బుట్టల అల్లిక, అగర్ బత్తుల తయారీ, ఫర్నీచర్ తయారీ, విద్యుత్తు ఉత్పత్తి తదితర వంటి వాటిలో వీటిని ఉపయోగిస్తారు. రైతుకు నిరంతరం ఆదాయాన్ని సమకూర్చే వనరుగా వెదురు వ్యవసాయం మారుతుంది. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఆదాయం ఉంటుంది"

# ఇక సర్కారు బడుల్లో నో బ్యాక్ బెంచ్!

తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఇక బ్యాక్ బెంచ్‌లు కనిపించవు. 'యూ'ఆకారంలో బెంచీలను అమర్చి వినూత్నంగా విద్యాబోధన చేపట్టేందుకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఇటీవల వినేశ్ విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన మలయాళ సినిమా 'స్థానార్థి శ్రీకుట్టన్' క్లైమాక్స్' సీన్ స్ఫూర్తితో తొలుత ప్రయోగాత్మకంగా కేరళలోని కొల్లం జిల్లాలోని రామవిలాసం ఒకేషనల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో అక్కడి అధికారులు ఈ

ఈ విధానం సత్ఫలితాలిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. కేరళతోపాటు ఒడిశా, పంజాబ్, తమిళనాడుల్లోని పలు పాఠశాలల తరగతి గదుల్లో కూడా విజయవంతంగా యూ ఆకారపు బెంచీల అమరిక విధానం అమలవుతున్న తీరు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి సికింద్రాబాద్ బోయనపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఒక తరగతి గదిలోని బెంచీ లను 'యూ'ఆకారంలో ఏర్పాటు చేయించారు. మధ్యలో టీచర్ నిలబడి పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థులతో కూడా ముచ్చటించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇక అన్ని సర్కారు పాఠశాలలో యూ ఆకారంలో బెంచీలు ఏర్పాటు చేసి విద్యాబోధన జరిగే విధంగా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

**సంప్రదాయ పద్ధతికి భిన్నంగా..**

సాధారణంగా బ్యాక్ బెంచ్ అనే పదం వినగానే సరిగ్గా చదవని పిల్లలు అందులో కూర్చుంటారన్న భావన అందరి మదిని తడుతుంది. అయితే వెనుక బెంచీల్లో ఉన్న విద్యార్థులు తక్కువ శ్రద్ధ, ముందు భాగంలో ఉన్నవారు ఎక్కువ శ్రద్ధ కనబర్చడంతోపాటు పాఠ్యాంశాలను సరిగ్గా అర్థం చేసుకోవడంలో కూడా వ్యత్యాసం ఉందని అధికారులు గుర్తించారు. యూ టైప్ సిట్టింగ్‌లో టీచర్ సందేహాలను



నివృత్తిలో వ్యక్తిగత శ్రద్ధ సాధ్యమవుతోందనే అంచనా అధికారుల్లో ఉంది. ఇది విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, అభ్యాస ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా చేస్తుందని భావిస్తున్నారు. ఇది విద్యార్థి కేంద్రీకృత అభ్యాసానికి ప్రాధాన్యతనిస్తుందని, విద్యార్థులందరూ ఒకే స్థాయిలో అభ్యసన ప్రక్రియలో పాలుపంచుకోవడానికి అవకాశం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

**ఇంటరాక్టివ్ లెర్నింగ్..**

ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి వృత్తాకార, సెమీ%-%వృత్తాకార తరగతి గది అమరికలు కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో, ముఖ్యంగా ఇంటరాక్టివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యతనిచ్చే విద్యాసంస్థల్లో అమలులో ఉన్నాయి. ఫిన్‌లాండ్ వంటి దేశాలు విద్యార్థుల మధ్య పరస్పర చర్చలను ప్రోత్సహించడానికి ఇలాంటి అమరికలను ఉపయోగిస్తాయి. యూ%-%టైప్ అమరిక అనేది కేవలం కూర్చునే విధానాన్ని మార్చడం మాత్రమే కాకుండా, సమగ్రమైన సమానమైన విద్యావ్యవస్థను రూపొందించడంలో ఒక ముఖ్యమైన అడుగు అని అధికారులు భావిస్తున్నారు.

## వరంగల్‌కు వరాల జల్లు

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి కోసం జరిగిన సమావేశంలో యంగ్ స్పోర్ట్స్ స్కూల్ స్థాపనతో పాటు స్టేడియం అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ మేరకు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్రీడా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, విదేశీ పెట్టుబడులను ఆకర్షించినందుకు ఎమ్మెల్యేలు సీఎంకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## సింహవాహిని అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మల్లు భట్టి విక్రమార్కని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. బోనాలు ప్రశాంతంగా అత్యంత భక్తి భావంతో కొనసాగుతున్నాయని తెలిపారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి రాష్ట్ర ప్రజలను చల్లగా చూడమని వేడుకున్నానని అన్నారు. దాదాపు రూ.1290 కోట్లతో దేవాదాయ శాఖకు నిధులు విడుదల చేశామని వెల్లడించారు. రూ.20 కోట్ల నిధులు హైదరాబాద్‌లో బోనాల కోసం విడుదల చేశామని ప్రకటించారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. మహంకాళి అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**అమ్మవారి దర్శించుకున్న ప్రముఖులు**

సింహవాహిని మహంకాళి అమ్మవారి దర్శనం కోసం పలువురు ప్రముఖులు క్యూ కడుతున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ కవిత, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన దర్శించుకున్నారు.

**లాల్ దర్వాజా బోనాల ఉత్సవాల్లో మొదటిసారి పాల్గొన్నా:మంత్రి వాకాటి శ్రీహరి**

లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల ఉత్సవాల్లో మొదటిసారి పాల్గొన్నానని మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు. అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని, తెలంగాణ ప్రభుత్వానికి అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని మంత్రి వాకాటి శ్రీహరి కోరుకున్నారు.

**అమ్మవారికి బోనం సమర్పించిన ఎమ్మెల్సీ కవిత**

అమ్మవారి బోనాల జాతరలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వచనాలు తీసుకున్నారు కవిత. తెలంగాణ ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. సుమారు 117 సంవత్సరాల చరిత్ర అమ్మవారికి ఉందని తెలిపారు. అమ్మవారి దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్సీ కవిత కోరుకున్నారు.

## చదువు ఒక్కటే కాదు - ఆటపాటలకూ మార్కులు!

-మొదటిపేజీ తరువాయి

సంగీతం, నాట్యం, ప్రసంగం వంటివాటిలో ప్రతిభ ఉండొచ్చు.

ఈ రాష్ట్రాలు మినహా : ఈ మేరకు విద్యార్థి వ్యక్తిత్వాన్ని, పురోగతిని, సృజనాత్మకతను ఒక్కమాటలో చెప్పాలంటే సమగ్ర చరిత్రను చెప్పేలా ఈ కార్డును రూపొందించనున్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలు తప్ప మిగతా రాష్ట్రాలన్నీ ఈ విద్యా సంవత్సరం (2025-26) నుంచే ఈ విధానాన్ని పాఠశాలల్లో అమలు చేస్తామని కేంద్రానికి తెలిపాయి.

తల్లిదండ్రుల అభిప్రాయాలు : విద్యార్థుల కుటుంబ వివరాలు, ఆధార్ సంఖ్య, మొబైల్ నంబరు, వివిధ పరీక్షల్లో (ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మేటివ్ అసెస్‌మెంట్) మార్కులు ఇప్పటి వరకు ఉన్నాయి. కొత్తగా గత విద్యాసంవత్సరం ఫలితాలు ఎలా ఉన్నాయో కూడా ఈ కార్డులో పొందుపరుస్తారు. అలాగే విద్యార్థి గురించి ఉపాధ్యాయుల అభిప్రాయాలు ఉంటాయి. విద్యార్థికి పాఠశాల నుంచి ఎలాంటి సహకారం అవసరం, తదితర అంశాలపై తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తీసుకుంటారు. పిల్లలు ఎలాంటి పురోగతి సాధిస్తున్నారో కూడా అభిప్రాయాన్ని పొందుపరుస్తారు.

తోటి విద్యార్థుల అభిప్రాయాలు : విద్యార్థుల గురించి వారి అభిప్రాయాలతోపాటు తోటి విద్యార్థుల అభిప్రాయాలనూ తీసుకుంటారు. ఇంట్లో చదువుకునేందుకు ఉన్న విద్యా వనరులైన పుస్తకాలు, దినపత్రిక, మొబైల్, ఇంటర్నెట్ వంటివి అందుబాటులో ఉన్నాయో లేదో పొందుపరుస్తారు. విద్యార్థుల స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలను కూడా తెలుసుకుని రాస్తారు. చదువుతోపాటు విషయాన్ని అర్థం చేసుకునే సామర్థ్యం, సృజనాత్మకత, సమస్యను పరిష్కరించే నేర్పు వంటి వాటిని ఉపాధ్యాయులు పరిశీలిస్తారు. ఆయా వివరాలను పత్రంలో పొందుపరుస్తారు.

ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో : ఈ కార్డులను ఆన్‌లైన్‌లోనూ భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ అధికారులకు సూచించారు. ప్రత్యేక యాప్ తయారీపైనా దృష్టి సారించారు. ఇటీవలే కార్డు నమూనా రూపకల్పనపై ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ఎంఈవోలు, ఇతర అధికారులతో కార్యశాల నిర్వహించారు. మరో వారంలో ప్రభుత్వానికి అందజేస్తామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఆమోదం అనంతరం సమగ్ర శిక్షా అధికారులు కార్డులను ముద్రించి పాఠశాలలకు సరఫరా చేస్తారు.

## నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి నష్టం జరగవద్దు

**జైపూర్:** నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి నష్టం జరగొద్దని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. జైపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాదికి నష్టం జరగకూడద న్నారు. " బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విమర్శలు వస్తున్నాయి. రాజకీయలబ్ధి కోసం విద్వేషాలు సృష్టించడం చాలా సులభం. ప్రజలు రోడ్ల మీద ధర్నాలు చేయనంత మాత్రాన అంతా బాగుందని అనుకోవద్దు. ప్రజలు రాజకీయ పార్టీలు, వ్యవస్థ మీద చాలా అసంతృప్తిగా ఉన్నారు" అని చెప్పారు. హిందీ భాష గురించి మాట్లాడుతూ.. భాష అనేది మాట్లాడానికే కాదని, సంస్కృతికి ఒక గుర్తింపు లాంటిదన్నారు. భారత్‌లో 22 అధికార భాషలు, 300 అనాధికార భాషలు ఉన్నాయని చెప్పారు. తాము ఎవరిపైనా తెలుగు భాషను రుద్దనప్పుడు.. వాళ్లు (కేంద్రం) ఎందుకు హిందీని ఇతరులపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు.

భారతదేశానికి జాతీయ భాష అవసరం లేదని, హిందీని తమపై రుద్దకూడదని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన హిందీ భాషా అంశంపై ఆయన మాట్లాడారు. జైపూర్‌లో జరిగిన టాక్ జర్నలిజం 2025లో భాగంగా జరిగిన చర్చలో భాష విషయంలో గట్టి వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కేటీఆర్, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి జాతీయ భాష గురించి అడగగా... హిందీ జాతీయ భాష కాదని, భారతదేశంలో అనేక అధికారిక భాషలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. "ఏ భాష అయినా భావవ్యక్తీకరణకు ఓ సాధనం మాత్రమే. అది ఒక సాంస్కృతిక చిహ్నం. భారత్ లో 20 అధికారిక భాషలు, 300 అనధికార భాషలు ఉన్నాయి. హిందీ మాట్లాడేవారు ఎక్కువ ఉన్నారని హిందీ భాషను మా మీద రుద్దుతామంటే కుదరదు. తెలుగు భాషను జాతీయ భాషగా చేయాలని ప్రతిపాదిస్తే మిగతా ప్రాంతాల వారు ఒప్పుకుంటారా? 70-80 ఏళ్ళు దేశం బాగుంటే, మళ్లీ జాతీయ భాష ఎందుకు?" అని ప్రశ్నించారు. హిందీ భాషకు బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించి, తెలుగు, బెంగాలీ భాషలకు ఎందుకు నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల ప్రజలపై తెలుగును రుద్దనప్పుడు హిందీని తమపై ఎందుకు రుద్దుతున్నారని ఆయన నిలదీశారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ అయినప్పటికీ, హిందీ నేర్చుకోవాలా వద్దా అనేది ప్రజలకే వదిలేయాలని, దానిని వారిపై బలవంతంగా రుద్దకూడదని ఆయన అన్నారు.

# బెల్లంపల్లి 13వ వార్డులో ఘనంగా బోనాల జాతర






**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి,జూలై20(సూర్య రేఖ)** బెల్లంపల్లి 13వ వార్డు గాంధీనగర్ బస్తీ ప్రజలు పెద్ద ఎత్తున భీమన్న బోనాల జాతర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఓబిసి స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని బస్తి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో రైతులకు పాడి పంటలు సక్రమంగా పండాలని భగవంతుని కోరుతూ మొక్కులు చెల్లించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాగనవేని వేణి ఐలయ్య నాగనావేణి చంద్రయ్య గజాణవేణి రాజయ్య గుండవేని నాగయ్య,కుమ్మరి సత్తన్న కాజీపేట మల్లేష్ అల్లిగట్టయ్య అల్లి కొమురయ్య నాగనవేణి గట్టయ్య బండారి సారయ్య గాజనవేని మల్లయ్య,జంగం గట్టయ్య బొడ్డు నీలవర్మ,సుద్దాల శ్రీనివాస్,మాచర్ల సదయ్య, నాగానివేని రాజేందర్ మాచర్ల మొగిలి ఉడుత రాజేష్ మాచర్ల రాజయ్య గాజనవేని సంపత్ నాగనివేణి మహేష్,మాచర్ల గట్టయ్య,నాగనవేని గజేందర్,నాగనవేణి నరేష్ నాగనవేణి గజేందర్ అల్లి రాజు మాచర్ల కనకరాజు మాచర్ల గోపి నాగనావేణి హరీష్,అల్లి సాగర్,నాగనావేణి సురేష్ అల్లి సాయి అల్లి మహేష్,అమ్ముల శ్రీను అమ్ముల కుమార్,బండారి శ్రీనివాస్ గజాణవేణి మహేష్ గజన వేణి నాగరాజు,సుద్దాల ప్రవీణ్,మాచర్ల సన్నీ కాజీపేట కల్కి బన్నీ గాంధీనగర్ బస్తి మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# సైన్య ఆధునీకరణలో కృష్ణారావుది చెరగని ముద్ర

జనరల్ కృష్ణారావు భారత ప్రసిద్ధ సైనిక అధికారులలో ఒకరు. ఆయన దూరదృష్టి గలవారు. 1971లో పాకిస్తాన్ తో జరిగిన యుద్ధంలో పాల్గొని అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. బంగ్లాదేశ్ విముక్తి సమయంలో ఆయన చేసిన సేవలు అసమానాలు. 1980 దశక ప్రారంభంలో భారత సైన్యాన్ని ఆధునీకరించడం ప్రారంభించారు. ఒక తరం సైనికులను ప్రేరేపించారు. జనరల్ కె.వి. కృష్ణారావుగా ఖ్యాతి నందిన కొటికల పూడి వెంకట కృష్ణారావు, జూలై 16 1923న విజయవాడలో కె.ఎస్. నారాయణ రావు, లక్ష్మీరావు దంపతులకు జన్మించారు. ఆయన ఆగష్టు 9, 1942 న ఇండియన్ ఆర్మీలో చేరారు. 1947 లో విభజన వరకు, యువ అధికారిగా ఉన్నపుడే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్, బెలూచిస్తాన్ లలో ఆయన పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌లలో విధులు నిర్వర్తించారు. భారత సైనిక దళాల మాజీ ఛీఫ్ ఆయ్యాక, జమ్మూ కాశ్మీర్, నాగాలాండ్, మణీపూర్, త్రిపుర రాష్ట్రాలకు గవర్నరుగా పని చేసారు. ఆయన జమ్మూ కాశ్మీరు గవర్నరుగా మొదటిసారి 1989 జూలై 11 నుండి 1990 జనవరి 19, రెండవసారి 1993 మార్చి 13 నుండి 1998 మే 2 వరకు పనిచేసి చెరగని ముద్ర వేశారు. 1947 లో విభజన వరకు విస్తృతమైన పంజాబ్ అవాంతరాల సమయంలో, తూర్పు మరియు పశ్చిమ పంజాబ్ లలో పనిచేశారు. 1947 - 48లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపక శిక్షకులలో కృష్ణారావు ఒకరు. 1949 - 51 మధ్య ఆయన డిఫెన్స్ అకాడమీలో పని చేశారు. 1965 - 66లో లడఖ్‌లో ఒక దళానికి, 1969 - 70లో జమ్మూ ప్రాంతంలో ఇన్‌ఫాంట్రీ విభాగానికి కమాండర్‌గా వ్యవహరించారు. 1970 - 72 మధ్య నాగాలాండ్, మణిపూర్‌లలో తిరుగుబాట్ల అణచివేత దళాలకు నేతృత్వం వహించారు. 1971 యుద్ధంలో రావు అందించిన సహకారం, దేశం యొక్క ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండి పోతుంది. ఆ కాలంలో, ఆయన విభాగం 1971లో భారత - పాకిస్తాన్ యుద్ధంలో కూడా పాల్గొంది. సిల్హెట్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడంలో, ఈశాన్య బంగ్లాదేశ్ విముక్తికి కీలక పాత్ర పోషించారు. ఆ యుద్ధంలో కృష్ణారావు చూపిన ధైర్యం, సాహసోపేత



నిర్ణయాలు, నాయకత్వ ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం పరమ విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. 1975 - 76 మధ్యకాలంలో, దేశ భవిష్యత్ రక్షణ కోసం పునర్వ్యవస్థీకరణ, ఆధునీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. ఆయన 1978-79 మధ్య ఆర్మీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ గా పని చేశారు. తదనంతరం, పదోన్నతి పొందారు. 1979-81 మధ్య కాలంలో వెస్టన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్- ఇన్ - చీఫ్ గా పని చేశారు. కృష్ణా రావు జూన్ 1, 1981 న ఆర్మీ స్టాఫ్ చీఫ్ గా నియమితులై, జూలై 1983 వరకు సమర్థ వంతంగా పని చేశారు. మార్చి 1982 నుండి జూలై 1983 వరకు సర్వీసులలో అత్యున్నత నియామకం అయిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ కూడా అయ్యారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బర్మా, బెలూచిస్తాన్ లలో పని చేశారు. దేశ విభజన సమయంలో తూర్పు, పశ్చిమ పంజాబ్‌ల్లో విధులు నిర్వర్తించారు. ఆయన ఆర్మీ ఛీఫ్ గా 1983 లో పదవీ విరమణ చేసారు. కృష్ణారావు సేవలను గుర్తించిన కేంద్రం ఆర్మీ చీఫ్‌గా రిటైరైన అనంతరం ఆయనకు గవర్నర్‌గా అవకాశం కల్పించింది. 1984-89 మధ్య నాగాలాండ్, మణిపూర్, త్రిపుర గవర్నర్‌గా ఆయన పని చేశారు. మధ్యలో 1988లో కొంతకాలం పాటు మిజోరం గవర్నర్‌గా అదనపు బాధ్యతలను నిర్వర్తించారు. 1989 - 90 మధ్య, తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో ప్రాక్సీ యుద్ధం గరిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు, 1993 - 1998 మధ్య జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా తిరిగి పని చేశారు. ఉగ్రవాదం, తిరుగు బాట్లతో అట్టుడికిన కశ్మీర్‌లో తిరిగి శాంతి నెలకొనేందుకు కృషి చేశారు. ఆయన జనవరి 30 2016 న న్యూఢిల్లీలో మరణించారు.

# టీ బీజేపీలో కుదుపు

కేంద్రంలో పాలనతోపాటు పార్టీని వదలని నేతలు, కార్యకర్తలు ఉన్న పార్టీగా పేరున్న బీజేపీలో పెద్దగా రాజకీయ సంక్షోభాలు కనబడవు. ఢిల్లీ గద్దెనే కాకుండా ఉత్తరభారతంలో అత్యధిక రాష్ట్రాల్లో తమ పాలనను నిలుపుకొంటున్న బీజేపీ.. దక్షిణాదిలో పాగా వేయాలని సుదీర్ఘ కాలంగా కలలు కంటున్నది. గతేడాది ఆంధ్రప్రదేశ్ పాలక కూటమిలో భాగమైనందుకు తెలుగు రాష్ట్రాల బీజేపీ అనుయాయులు మురిసిపోతున్నారు. అదే ఊపులో తెలంగాణలో కూడా డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయాలని వారు ఉబలాటపడుతున్నారు. నిజానికి రాజకీయ సమీకరణాలు కుదరక, కాంగ్రెస్ తప్పిదాల వల్ల తెలంగాణలో బీజేపీ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో చెప్పుకోదగ్గ స్థానాలు సాధించగలిగింది తప్ప, ఇప్పటికీ ఈ నేలకు చెందిన ఓటర్ల మనస్సుల్లో 'ఇది మా పార్టీ' అన్న ముద్రను వేయలేకపోయింది. పార్టీలో ఉన్న నేతలతో పాటు తమ రాజకీయ అవసరాల కోసం చేరిన కొందరు రాజకీయ జీవులు తప్ప కొత్తగా ఆ పార్టీకి బలం చేకూరేలా జరిగిన పరిణామాలేవీ లేవు. ఎన్నికల సమయంలో గాలివాటం లాభం తప్ప జనం ఆ పార్టీ వెంట ఉన్నారని చెప్పడానికి రుజువులేమీ కానరావు. ఆ పార్టీ నాయకుల వెంబడి ఎప్పుడూ ఉండే కాషాయ తలపాగాల పాత ముఖాలే తప్ప కొత్తవేవి కానరావు.

అయితే కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వం. కాబట్టి, తెలంగాణను కూడా బుట్టలో వేసుకొనే విద్య ఏదో వారి దగ్గర ఉంటుందనే ఆశ ఆ పార్టీ నాయకుల్లో ఉంది. తెలంగాణలో ఎటూగాని నేతలకు ఆశ్రయంగా పనికి రావడంతో ఆ పార్టీ నాయకుల సంఖ్య కూడా పెరిగింది. అయితే, ఈ మధ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక సమయంలో ఆ పార్టీ కొంత కుదుపులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎన్నడూ లేని విధంగా కొందరు నేతలు తమ అసంతృప్తిని బహిరంగ చర్చకు తెచ్చారు. ఆ పదవిని ఆశించినవారిలో ఈటెల పేరు కూడా వినవచ్చింది. తనకు పదవిని కట్టబెట్టనందుకు ఆయన అలకబూనినట్టుగా వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే నిస్పృహలో జారుకున్నట్టుగా తెలుస్తున్నది. పార్టీ లైన్‌ను దాటి బహిరంగంగా ఎవరూ నోరు జారవద్దన్న అధిష్ఠానం ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఓ సీనియర్ నేతపై పరోక్షంగా మాటల దాడికి దిగడం చర్చనీయాంశంగా మారింది. ఇది ఆ పార్టీలో నేతల మధ్య సఖ్యత కొరవడిందని చెప్పేందుకు నిదర్శనం. నిజానికి ఈటెలను బీజేపీ రాజకీయంగా ఎంతగానో కాపాడింది. ఎమ్మెల్యేగా ఓడిపోయినా మేడ్చల్ పార్లమెంట్ సీటిచ్చి గెలిపించుకుంది. బీఆర్ఎస్‌ను వదిలిపెట్టిన తర్వాత ఆయన ఓ రాజకీయ శూన్యంలోకి కూరుకుపోయారు. తన చుట్టూ భూకబ్జాల కేసులు చుట్టుముట్టాయి.

## సంపాదకీయం

# ఈ అరకొర నివేదిక దేనికి?!

ఒక పెను విషాదంపై జరిగే దర్యాప్తు ఎంతో బాధ్యతాయుతంగా వుండాలి. ఆ ఉదంతంలో అసలు జరిగిందేమిటో చెప్పే ప్రయత్నం చేసినప్పుడు అస్పష్టతకు తావీయకూడదు. ప్రాథమిక దర్యాప్తుకైనా, పూర్తిస్థాయి దర్యాప్తుకైనా ఇదే వర్తిస్తుంది. కానీ గత నెల 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదం విషయమై శుక్రవారం అర్ధరాత్రి వెలువరించిన ప్రాథమిక దర్యాప్తు ఆ నియమాలను ఉల్లంఘించింది. బాధిత కుటుంబాల్లో అయోమయాన్ని మరింత పెంచింది. ఆ ప్రమాదం వైమానిక ప్రమాదాల చరిత్రలో పెద్దది. ఆ విషాద ఘటన సమ యంలో విమానంలో 242 మంది ప్రయాణికులుండగా, ఒకరు క్షేమంగా బయటపడ్డారు. భవంతిపై కూలినందువల్ల అక్కడున్న 19 మంది ప్రాణాలు కోల్పోయారు. విమానంలో ఇంధనాన్ని నియంత్రించే స్విచ్‌లు రెండూ ఆపివేసి వుండటం వల్లనే ప్రమాదం జరిగివుండొచ్చని దర్యాప్తు చేస్తున్న విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక భావించింది. ఇది కేవలం ప్రాథమిక నివేదికే గనుక వెంటనే నిర్ణయానికి రావటం తగదని కేంద్ర వైమానిక మంత్రిత్వ శాఖ అంటున్నది. మంచిదే. అటువంటప్పుడు ఏఏఐబీ నివేదిక స్విచ్‌ల విషయంలో మరింత సమాచారం అందాకే వాటిని ప్రస్తావించి వుండాల్సింది. పైలెట్ల సంఘం కూడా నివేదికను తప్పుబడు తోంది. పైలెట్ల తప్పిదమే కారణమని అర్థం వచ్చేలా నివేదిక వుండటం సరికాదని విమర్శిస్తున్నారు. దర్యాప్తులో తమ ప్రతినిధికి ఇప్పటికైనా చోటీయాలని వారు అంటున్నారు. ఈ అయోమయం ఇప్పటికే పుట్టెడు దుఃఖంలో వున్న బాధిత కుటుంబాలను మరింత నొప్పించదా? అంతర్జాతీయ వైమానిక నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన ఏడాదిలోగా తుది నివేదిక రావాలి. ఈలోగా విడుదల చేసే ప్రాథమిక నివేదిక పైలెట్లను తప్పుబట్టే విధంగా వుండటం, ఆ తర్వాత దాన్ని ప్రామాణికంగా తీసుకోవాల్సిన అవసరం లేదనటం న్యాయమేనా? ఘటనా స్థలంలో దొరికిన స్విచ్‌లున్న పరికరంలో అవి రెండూ 'ఆన్' చేసివున్నాయి. కానీ కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో ఒక పైలెట్ మరొకరితో 'ఇంధనం ఎందుకు నిలిపివేశావ్' అని అడగటం, అందుకు రెండో పైలెట్ 'నేనలా చేయలేదే...' అంటూ జవాబివ్వటం వినబడటాన్నిబట్టి స్విచ్‌లు ఆపివేసి వున్నట్టు దర్యాప్తు బృందం నిర్ధారణకొచ్చింది. కానీ రెండో పైలెట్ ఆ వెంటనే వాటిని సరిచేసి వుండొచ్చని, అందుకే అవి సక్రమంగా వున్న స్థితిలో లభించాయని నివేదిక అంటున్నది. ఈ సంభాషణల్లో అడిగిన వారెవరో, జవాబిచ్చిన వారెవరో దర్యాప్తు చేసినవారు గుర్తించారా? గుర్తించి వుంటే ఆ సంగతి వెల్లడించటానికి వారికున్న అభ్యంతరమేమిటి? ఒకవేళ అలాంటి అభ్యంతరం వున్నప్పుడు అసలు ఆ సంభాషణను బయటపెట్టడం దేనికి? విమానంలోని యాంత్రిక వ్యవస్థలు సంక్లిష్టమైనవి. విమాన గమనంలో మనుషుల జోక్యం దాదాపు అవసరం లేని 'ఫ్లై బై వైర్' వ్యవస్థ అందుబాటులోకొచ్చి దశాబ్దాలవుతోంది. ముఖ్యంగా విమానం టేకాఫ్ సమయంలోనూ, దిగే సమయంలోనూ ఆ వ్యవస్థ పూర్తిగా తనకు తానే అన్నిటినీ సరిచేసుకుంటుంది. పైకెగిరినప్పుడూ, కిందకు దిగినప్పుడూ అవసరమైన ఇంధనం సరఫరా అయ్యేలా చూసుకుంటుంది. ఇవి విఫలమైన పక్షంలో పైలెట్ అవసరమైన మార్పులు చేసుకోవ డానికే స్విచ్‌లుంటాయి. రెండు స్విచ్‌లకూ రెండువైపులా రింగ్‌లుంటాయి. వాటికి ప్రత్యేక లాకింగ్ వ్యవస్థ వుంటుంది. మనిషి ప్రత్యేకించి వాటిని స్విచాన్ చేయటానికైనా, స్విచాఫ్ చేయటానికైనా ముందు ఆ లాకింగ్‌ను తెరవక తప్పదు. రెండు స్విచ్‌లూ ఆగిపోవటానికి మధ్య సెకను వ్యవధి వుందని తేల్చారు. పైగా పైకెగురుతున్న సమయంలో ఎక్కువ ఇంధనం సరఫరా కావాల్సి వుండగా దాన్ని కావాలని ఏ పైలెట్ కూడా స్విచాఫ్ చేయడు. దానిపై దర్యాప్తు బృందం ఏ నిర్ధారణకూ రాలేదు. పైలెట్లుగా వ్యవహరించినవారి చరిత్ర చూసినా ఉద్దేశపూర్వకంగా ఆపివుంటారని ఊహించటం అసాధ్యం. ప్రధాన పైలెట్ సుమీత్ సభర్వాల్‌కు బోయింగ్ 787ను 8,600 గంటలు నడిపిన సర్వీస్ (మొత్తంగా 15,638 గంటల సర్వీస్) వుండగా, కో పైలెట్ క్లైవ్ కుందేర్‌కు బోయింగ్‌పై 1,100 గంటల అనుభవం, మొత్తంగా 3,403 గంటల అనుభవం వుంది. ఇద్దరూ ఈ విమానం నడపటానికి ముందు తగినంత విశ్రాంతి తీసుకున్నవారే. ప్రధాన పైలెట్ పర్యవేక్షణలో కో పైలెట్ ఇష్టానుసారం చేయటం సాధ్యపడదు. ఒకవేళ ఆ ప్రయత్నం జరిగివుంటే వాగ్వాదం చోటుచేసు కునేది. అది రికార్డయ్యేది. పూర్తి స్థాయి పారదర్శకతకు దర్యాప్తు సంస్థ ఎందుకు వెనకాడుతోంది? ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను కేవలం ఒక ప్రశ్న, జవాబు స్థాయికి కుదించటంలోని మర్మమేమిటి? అటు తర్వాత లేదా అంతకుముందు వారేం మాట్లాడుకున్నారు? ఇది చెప్పకపోతే పైలెట్లలో ఒకరు ఆత్మాహుతికి పాల్పడ్డారా అనే సంశయం బయల్దేరుతుంది. ఎయిర్‌లైన్స్ రేటింగ్స్ వెబ్‌సైట్ ప్రధాన సంపాదకుడు జెఫ్రీ థామస్ అడుగుతున్నది ఇదే. దర్యాప్తు ఫలితాల గురించి అంతర్జాతీయంగా అనేకులు ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే ఈ రకం విమానాలను బ్రిటిష్ ఎయిర్‌వేస్ సంస్థ, వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ప్రధానంగా వినియోగిస్తున్నాయి. ప్రాథమిక నివేదిక విడుదల చేయటం స్వాగతించదగిందే. కానీ ఇప్పటికే వున్న సంశయాలను మరింత పెంచేలా, అస్పష్టత అలుముకునేలా అది వుండటం సరికాదు. పైలెట్ల మధ్య జరిగిన సంభాషణ పూర్తి పాఠం విడుదల చేస్తే అటు పైలెట్‌ల సంఘం అభ్యంతరాలతోపాటు, ఇటు బాధిత కుటుంబాల సంశయాలు కూడా సమసిపోతాయి.

# తెలంగాణ రాష్ట్రంలోని హోమ్ గార్డ్ ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రతి నెల ఒకటి రెండు తేదీలలో అధికారులతో సమానంగా జీతాలు వేయాలి..**

**ఎంసిపిఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్**

**బెల్లంపల్లి,జూలై20(సూర్యరేఖ)** బెల్లంపల్లి ఎంసిపిఐయూ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ. హోంగార్డ్స్ అనేది భారతదేశంలో మొదటి డిసెంబర్ 1946లో పురుడు పోసుకుంది. స్వచ్ఛంద దళం,పౌర అల్లర్లు మత అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి తదనంతరం,స్వచ్ఛంద పౌరదళం అనే భావనను అనేక రాష్ట్రాలు స్వీకరించాయి. 1962లో చైనా దురాక్రమణ నేపథ్యంలో కేంద్రం రాష్ట్రలు,కేంద్ర పాలిత ప్రాంతాలకు సలహా ఇచ్చింది.మరి ఇప్పుడు వాళ్ల స్థితిగతులు తారుమారు హోంగార్డుల కన్నీళు తుడిచే నాధుడు అడుగడుగునా ఆంక్షలు ప్రశ్నిస్తే క్రమశిక్షణ చర్యలు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు15 వేలమంది హోమ్ గార్డులు ప్రజల కోసం ఆహర్నిశలు సేవ లందిస్తున్నారు.వానకు తడిచి ఎండకు ఎండి ప్రజాప్రతినిధుల రాజకీయ సభలు,సమావేశాలు ఎక్కడ పెట్టిన బందో భస్తు సమర్థంగా నిర్వహిస్తారు. ప్రజల కోసం శాంతి భద్రతల కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారు.లేదు వీరి సంక్షేమం గురించి ఏమాత్రంపట్టింపు లేదు.అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి భద్రత కల్పించడం లేదు. 25 మార్చి ఢిల్లీ అఖిలభారత హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం కొనసాగింది.




బ్రిటిష్ కాలంలో ఏర్పడిన ఈ సంస్థ ఇంకా స్వస్థత సేవగా కొనసాగుతూ శ్రమ దోపిడీకి గురవుతుంది.భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన హోంగార్డులను మాత్రం ఎలాంటి స్వాతంత్రం లేక కాకి బట్టల నడుమ నలిగి పోతున్నారు.వీరికి కారకులు అనేకమంది అనేక కారణాలు ఎవరికి తోచిన విధంగా వారు ఆదేశాలు ఇస్తారు.ఆపద వస్తే ఆదుకునే నాధుడు కరువయ్యారు.ప్రభుత్వాలు మరి నాకు బ్రతుకులు మారుతాయి అన్న ఆశతో రాజకీయ పార్టీ జెండాలను హక్కును చేర్చుకుంటున్నారు.అవసరం తీరాక అందరూ దూరం కొడుతున్నారు.2016 నుండి హోంగార్డ్ కుటుంబాలకు కారుణ్య నియామకాలు లేక వారి పిల్లలు వారి కుటుంబాలు చాలా దయనీయ పరిస్థితుల్లో జీవనం కొనసాగిస్తున్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కుని కోల్పోయి భిక్షాటన చేసే పరిస్థితుల్లో ఉన్నారు.ఎన్నో మార్లు విజ్ఞప్తులు చేసిన సాక్షాత్తు ఆనాడు ముఖ్యమంత్రి ప్రతిపక్ష హోదాలో అండగా నిలబడి ఈనాడు కనీసం హోంగార్ల గురించి పలకరింపు కరువైంది.ఈ శాఖకు అధిపతి లేక సమస్యలు ఎవరు పట్టించుకోవడం లేదు.ఉమ్మడి జిల్లాల నుండి నూతల జిల్లాలు ఏర్పడిన నాడి నుండి ఈరోజు వరకు దాదాపు 100 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఉద్యోగం చేస్తున్నారు.వారి పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుంది.వారి తల్లిదండ్రులు పోసిన భారం అవుతుంది. కానిస్టేబుల్ వలె వీరికి టి.ఎ లు, హెచ్ ఆర్ ఎ.లు లాంటిఅలావెన్స్ లు ఏవి ఉండవు. ఆఖరికి ప్రజలను కాపాడడం కోసం,దొంగలను పట్టుకోవడం కోసం పరిగెడితే ఆ సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు పట్టించుకోరు. ముఖ్యమంత్రి డిసెంబర్ 6 తారీకు ప్రకటించిన హెల్త్ కార్డు ఇప్పటివరకు మోక్షం లేదు.ఇప్పటికైనా ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా హోమ్ గార్డ్,ల సమస్యలను తీరుస్తామని బహిరంగగా ఒక లేఖలో రాయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**హోం గార్డ్,ల డిమాండ్స్ ..**

హోంగార్డులకు హెల్త్ కార్డుల అందజేయాలి అంగన్వాడి తరహాలో హోంగార్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి,కారుణ్య నియామకాలు అమలు చేయాలి కానిస్టేబుల్ రిక్రూట్మెంట్ లో సీనియార్టీ ప్రతిపాదికన ఎక్స్ సర్వీస్ మెన్ కు ఇస్తున్న సడలింపులు హోంగార్లకు ఇవ్వాలి,ప్రతినెల పోలీసులతోపాటు ఒకటవ తారీఖు వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,ఆరెపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ కు సన్మానం..



**నిజాంపేట,జూలై20(సూర్యరేఖ)** మెదక్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన తాడెం వెంకటేష్,ను ఆదివారం నిజాంపేట మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మున్నూరు కాపు బిడ్డ జిల్లా కోర్టుకు పిపిగా అయినందున వారికి కృతజ్ఞతలు తెలుపుతూ మునమందు జిల్లా స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ మున్నూరు కాపు కుల సంఘ సభ్యుల అభ్యున్నతి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు,మాజీ సొసైటీ చైర్మన్ దేశెట్టి లింగం,నాయిని లక్ష్మణ్,వెంకటేశం ఆకుల రమేష్,నర్సింలు,తాడెం కొమరయ్య,మల్లేశం, బాలరాజు,ఆకులనారాయణ బాజా అంజయ్య,రాజు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో బంగారు మైసమ్మ అమ్మవారికి భక్తుల బోనాలు..




**నాంపల్లి,హైద్రాబాద్,జూలై20(సూర్యరేఖ)** ఆషాఢ మాస బోనాలను పురస్కరించుకుని మెహిదీపట్నం నుంచి అత్తాపూర్ ప్రధాన రహదారి పివి నర్సింహారావు ఫ్లైవర్ బిర్జ్ 79 పిల్లర్ వద్ద గల మైత్రి ఆసుపత్రి సమీపంలోని బంగారు మైసమ్మ దేవాలయంలో ఆలయ చైర్మన్ ఎన్.కిషన్ సింగ్ పర్యవేక్షణలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా భక్తులు బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఆలయ పాలకమండలి భక్తులకు ఇబ్బందులు కలుగకుండ ఏర్పాట్లను పర్యవేక్షించారు.భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనాల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమంలో కమల్ సింగ్,ఎన్.బినేష్ సింగ్,డిధార్ సింగ్,ఎన్.రోహిత్ సింగ్,ఎన్.విక్రమ్ సింగ్, ఎన్.రమేష్ సింగ్,ఎన్.ఆశిష్ సింగ్,విశాల్ సింగ్,ప్రేమ్నాథ్ సింగ్ లక్సమం సింగ్,సునీల్ సింగ్,రాహుల్ సింగ్,నితిన్ సింగ్ తదితరులు భక్తులకు సేవలందించారు.

## ఘనంగా జ్ఞాన జ్యోతి విద్యాలయంలో వివిధ రకాల వేషధారునతో బోనాలు నిర్వహించిన విద్యార్థి విద్యార్థినిలు





**అందోల్,జులై 20(సూర్యరేఖ)** ఆశడమాసం బోనాలు పురస్కరించుకొని రాయికోడ్ మండలం చీమ్నపూర్ లోని జ్ఞానజ్యోతి విద్యాలయంలో విద్యార్థినులు విద్యార్థులు స్కూల్ ప్రిన్సిపాల్ మనీల్ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పోతురాజు విన్యాసాలు,శ్రీమహంకాళి దేవి అలంకరణలో విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల దేవుళ్ళ వేషధారణలు చాలా చూడముచ్చటగా భక్తిశ్రద్ధలతో విద్యార్థులు స్వయంగా బోనాల తయారు చేశారు. అందరూ విద్యార్థులు టీచర్లు బోనాల కార్యక్రమంకు సహకరించి విజయవంతం చేయటం జరిగింది. ఈ కార్యక్రమాని విజయవంతం చేసిన విద్యార్థి విద్యార్థులకు తోటి టీచర్లకు ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం ఇన్చార్జి దిలీప్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## నేడు రామంతపూర్ లో ఫలహారపు బండి ఊరేగింపు..

**ముఖ్యఅతిథిగా హాజరుకానున్న సినీ దర్శకులు నిర్మాత త్రినేత్రరావు**



**ఉప్పల్,జూలై 20 (సూర్యరేఖ)**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి గడ్డం రవికుమార్ ఆహ్వానం మేరకు రాజుయాదవ్, యాదవ్ సంఘం ప్రతినిధి బొట్టు చిన్న ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రామంతపూర్ లో నిర్వహిస్తున్న పలారం బండి ఊరేగింపుకు సినీ దర్శకులు నిర్మాత త్రినేత్రరావు నక్కిని ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు పెద్ద ఎత్తున ఊరేగింపుకు ఏర్పాట్లు చేసి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు.అంగరంగ వైభవంగా నిర్వహించే పలహారపు బండి ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# "బస్తీబాట"తో కాలనీలలో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికై కృషి





**కాంగ్రెస్ పార్టీ "బస్తీబాట" కార్యక్రమంలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో కాలనీవాసులతో కలిసి పర్యటించిన నెమలి అనిల్ కుమార్**

**ఉప్పల్,జూలై 20 (సూర్యరేఖ)** "బస్తీబాట"లి కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీ వాసులతో కలిసి పర్యటించడం జరిగింది. కాలనీలో ఉన్న ప్రధాన సమస్యల గురించి తెలుసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగింది.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రీన్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త మల్లారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ దేవిరెడ్డి రంగారెడ్డి, అడ్వైజర్ శ్రీపాద సర్వేశ్వర్ రావు,,గ్రీన్ హిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు నెమలి సత్తయ్య గోవర్ధన్ రెడ్డి మోసిన్ అల్తాఫ్, అశోక్,వరుణ్ రెడ్డి,మోటె సురేష్ విజయ్ గౌడ్ హనుమంత్,పాపి రెడ్డి జహంగీర్ మధురెడ్డి మేడ్చల్ మల్కాజ్గిరి ఎస్సి. సెల్ అడ్వైసర్ పీజీ. సుదర్శన్ మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శ్రీకాంత్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్ మల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్ కోయలకొండ రాజేష్,శ్రీనివాస్ సాయి రఘు హరి రవి తదితరులు పాల్గొన్నారు.



# నస్కల్ లో గ్రామ దేవతలకు బోనాలు





**నిజాంపేట,జూలై20(సూర్యరేఖ)** మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులందరూ ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని లస్కర్ లాల్ దర్వాజ్ బోనాల సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి గ్రామదేవతలకు బైండ్ల వారి నృత్య ప్రదర్శనల మధ్య ఊరేగింపుగా తల్లి గ్రామ దేవతలకు బోనాలను సమర్పిస్తామన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పాడిపంటలు సుభిక్షంగా పండాలని గ్రామస్తులంతా అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు.కార్యక్రమంలో గ్రామస్తులు తాజా మాజీ ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు దేశెట్టిలింగం,వెంకటస్వామిగౌడ్,నగేష్ యాదవ్ మెట్టు వెంకట్,ఎర్ర గౌడ్ లింగంగౌడ్ ఎల్లం యాదవ్ దుర్గయ్య,తదితరులు పాల్గొన్నారు.


# నల్లపోచమ్మ అమ్మవారికి భక్తి శ్రద్ధలతో భక్తుల బోనాలు





**నాంపల్లి,హైద్రాబాద్,జూలై20(సూర్యరేఖ)** గుడిమల్కాపూర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ లోని ఆలయంలో కొలువైవున్న నల్లపోచమ్మ అమ్మ వారికి ఆషాఢ మాస బోనాలను పురస్కరించుకుని అస్సోసియేషన్ చైర్మన్ అనీల్ చారీ పర్యవేక్షణలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా భక్తులు బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బాలాజీనగర్ కాలనీ పాలక మండలి భక్తులకు ఇబ్బందులు కలుగకుండ ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో నర్సిమ్మ రెడ్డి రాజు శ్రీకాంత్,రాము ప్రెస్,గున్నల రంగా రెడ్డి రాకేష్,మహేష్,రుద్రేశ్,సంతోష్,చంద్రకాంత్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలందించారు.

## శ్రీశ్రీ త్రిశక్తి నల్లపోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్





**ఉప్పల్,జూలై20 (సూర్యరేఖ)** బోనాల పండుగ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డినగర్ శ్రీశ్రీశ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ దేవాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరిష్,లు సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ. అమ్మవారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో విరజిల్లాలని మొక్కుకున్నట్లు వెల్లడించారు. కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మాట్లాడుతూ అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటే అనుకున్న పనులు జరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం సాయి చెల్లోజు ఎల్లాచారి, వంగాల సంతోష్ గుప్తా బిజెపి నాయకులు భక్తులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,జూలై 20 (సూర్యరేఖ)** ఆషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం ఉప్పల్ డివిజన్ లోని కురుమనగర్,ఉప్పల్ హిల్స్,లక్ష్మి నరసింహకాలనీలో పళ్ళు దేవాలయలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై అందరిపై ఉండాలని ప్రజలు అమ్మవారి దీవెనలతో సుఖసంతోషాలతో వెలసిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు



ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి బోనాల ఆతిధ్యమిచ్చిన దేవర వంశీ



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 20 (సూర్యరేఖ)** ఆషాఢ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ సెంట్రల్ జోన్ నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు దేవర వంశీ మర్యాద పూర్వకంగా బోనాల పండుగకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని ఆహ్వానించిన ఆతిధ్యమిచ్చారు.

## శ్రీకట్ట మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి బోనం సమర్పించిన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు



**ఉప్పల్,జూలై 20 (సూర్యరేఖ)** ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం రామంతపూర్ డివిజన్‌లోని శ్రీకట్ట మైసమ్మ దేవాలయంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు.స్థానిక భక్తుల మధ్య శ్రద్ధ భక్తులతో పాల్గొన్న కార్పొరేటర్ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్కాజ్గిరి లోక్ సభ సభ్యుడు ఈటల రాజేందర్ కు బోనాల ఆతిధ్యమిచ్చిన దేవర శ్రీనివాస్ కుటుంభం



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై20(సూర్యరేఖ)**భారతీయ జనతా పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్ ఆషాఢ మాస కార్వాన్ లో నిర్వహించు బోనాల పర్వదినంను పురస్కరించుకుని మర్యాద పూర్వకంగా బోనాల పండుగకు మల్కాజ్గిరి లోక్సభ సభ్యుడు ఈటల రాజేందర్ ను సాదరంగా ఆహ్వానించిన ఆతిధ్యమిచ్చారు. అనంతరం శాలువాతో సత్కరించి,శ్రీకృష్ణుడి కాంస్య విగ్రహమును కుటుంభం సమేతంగా బహుకరించారు.

## హేమనగర్ కాలనీలో ఉచిత వైద్యశిబిరం..

**సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సౌజన్యంతో**



**హైదరాబాద్,జూలై20 (సూర్యరేఖ)**బోడుప్పల్ హేమానగరకాలనీ అధ్యక్షులు మాడుగుల శివయాదవ్ అధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు.కాలనీవాసులు పెద్ద సంఖ్యలో ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.కార్యదర్శి లడ్డు శ్రీనివాస్,పాకగిరి జగదీశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీనాథ్, కమిటి సభ్యులు పెద్దిరెడ్డి,హరపాల్ రెడ్డి,ఎ. మల్లారెడ్డి,యోగ గురువు ఫణిందర్,గాంధీ,ఎ.వేణు, హైకోర్ట్ అద్వకేట్ డి.శ్రీనివాస్,న్యూసేమానగకాలనీ అధ్యక్షులు కట్కం రాజేష్ కోశాధికారి వీరన్న చారి, మోహన్ రావు,మాజీ అధ్యక్షులు చంద్రమౌళి ఒమ్ ప్రకాష్,మాజీ అధ్యక్ష,మాజి సెక్రటరీ మల్లయ్య మ్యాక్డోల్ కాలనీ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డి,సెక్రటరీ మల్లేష్ వెస్ట్ బాలాజీ హీల్స్ ప్రెసిడెంట్ చింతల శ్రీనివాస రెడ్డి,విజయలక్ష్మి,తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# గుడిమల్కాపూర్ వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ చేతుల మీదుగా నల్లపోచమ్మ అమ్మవారికి బోనాలు




**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 20 (సూర్యరేఖ)** గుడి మల్కాపూర్ వ్యవసాయ కూరగాయల మార్కెట్ అనుబంద ఇంద్రారెడ్డి పూల మార్కెట్ కొలువై యున్న శ్రీనల్ల పోచమ్మ ఆలయం వద్దకు నల్ల పోచమ్మ ఆలయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్,ఉపాధ్యక్షులు ఏం.యాదగిరి, ప్ర.కార్యదర్శి బి.నర్సింగ్ రావు కోశాధికారి గుంట రాజేందర్,ల బృందం డప్పువాయిద్యాలతో పోతురాజుల విన్యాసాలతో తొట్టెలను భారీ జనసందోహంతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.అమ్మవారి పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుడిమల్కాపూర్ వ్యవసాయ కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ హాజరై పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. వ్యాపారాలు భక్తులు భారీసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు సోమాచారి బాబు చందు,గణేష్ తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

# పోలీసుల,అటవీశాఖ అధికారులపై దాడి చేసిన ముల్తానీలు





**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా,జులై 20 (సూర్యరేఖ)** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవ పట్నంలో ఆదివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. ముల్తానీలు అటవీశాఖ అధికారుల మధ్య ములుగుతున్న భూవివాదం అగ్నిగుండంలా మారింది.కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ ఫారెస్ట్ కు సంబంధించిన కేశవపట్నంలోని కంపార్ట్మెంట్ 71,72 లోని భూమిలో మొక్కలు నాటడానికి ఆదివారం అటవీశాఖ అధికారులు పోలీసులతో సహా వెళ్ళగా అక్కడే నివసిస్తున్న ముల్తానీలు తాము ఎప్పటి నుంచో ఆభూమిని చదును చేసుకుని వినియోగిస్తున్నామని మాకు ఎలాంటి వ్యవసాయ భూములు లేనందున మా జీవన ఉపాధి ఈ భూములపైనే కొనసాగుతుందని ఇలాంటి భూమిలో మొక్కలు నాటితే ఊరుకునేది లేదని ఫారెస్ట్ అధికారులపై తిరగబడ్డారు. అటవీశాఖ అధికారులు సైతం ఆ భూమి మా అటవీశాఖకు సంబంధించిందని ఇక్కడ తప్పనిసరి మొక్కలను నాటవలసింది అని పట్టుబట్టడంతో అటవీశాఖ అధికారులు ఆ గ్రామస్తుల మధ్య వివాదం చెలరేగి ఆ ముల్తానీలు రాళ్లతో కట్టెలతో అక్కడికి వెళ్లినటువంటి అటవీశాఖ అధికారులపై



పోలీసులపై దాడి చేయడంతో అటవీ శాఖ,పోలీస్ శాఖలకు సంబంధించిన వాహనాలు ధ్వంసం అయ్యాయి.ఈ దాడిలో పోలీస్,అటవీశాఖ అధికారులు ఏమి చేయలేక వెనుతిరగవలసి వచ్చింది.ఈ దాడిలో గాయపడ్డ ముగ్గురు పోలీస్ కానిస్టేబుల్,లను అంబులెన్స్ ద్వారా ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్ కు తరలించడం జరిగింది.వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని పెద్ద ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలిపారు.అటవీశాఖ పోలీసులపై దాడి చేసినటువంటి వ్యక్తులను పట్టుకుని చట్టరీత్యాచర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.

# ఆషాడ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**ఉప్పల్,జూలై20 (సూర్యరేఖ)** ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ నియోజక వర్గ పరిధిలోని నాచారం డివిజన్ లోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిరెడ్డి సందర్శించి అమ్మవార్ల ప్రత్యేక పూజలో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వెలసిల్లాలని కోరుకున్న ట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్,బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఉమ్మడి రాష్ట్ర ఎస్సీ సేల్ మాజీ చైర్మన్ మిత్రకృష్ణ ఘనంగా సత్కారం.

**నాంపల్లి,హైద్రాబాద్,జూలై20 (సూర్యరేఖ)** సబ్జిమండి గంగపుత్ర సంఘం వద్దగల శ్రీమహంకాళి దేవి ఆలయంలో గల అమ్మవారికి నల్లపోచమ్మ దేవి,మహంకాళి దేవి ఆలయ కమిటీ 103వ వార్షిక బోనాల మహోత్సవం పురస్కరించుకుని మిత్ర అసోసియేట్స్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,ఉమ్మడి రాష్ట్ర ఎస్సీ సేల్ మాజీ చైర్మన్ ఆయిందాల కృష్ణ (మిత్రకృష్ణ) ఆలయ మర్యాదలతో ఆహ్వానించి శాలువాతో సత్కరించి జ్ఞాపికను నిర్వాహకులు అందజేశారు.



## ప్రమాదవశత్తు వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి..






**మంచిర్యాల జిల్లా జులై 20 (సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా దండ పెల్లి మండలం నంబాల గ్రామంలో ఆదివారం రుద్రవంశీ అనే యువకుడు ప్రమాదవశత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు.లక్షింపేట పట్టణం నుండి ఐదుగురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలపై నంబాల గ్రామం వైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం రోడ్డుపై ఉన్న మట్టి కుప్పకు తగిలి రోడ్డు ప్రక్కకు ఉన్న వ్యవసాయ బావిలో పడడంతో రుద్రవంశీ అనే యువకుడు మృతి చెందాడు.లక్కీ అనే యువకుడు చెట్టు కొమ్మను పట్టుకొని ఏదోలా బయటికి వచ్చి ప్రమాదం నుండి బయటపడ్డాడు.ఈ వాహనం వెనుక వస్తున్నటువంటి కొందరు వ్యక్తులు ఈ ఘటనను చూసి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇవ్వగా దండ పెల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తహసీనుద్దీన్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి మృతదేహాన్ని పోర్టు మార్టం నిమిత్తం లక్షిట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## ప్రభు పూజారి కుటుంబ సభ్యులతో అమ్మవార్లకు బోనాల సమర్పణ..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 20 (సూర్యరేఖ)** కార్వాన్ రాంసింగ్ పూర ప్రాంతంలోని శ్రీనల్లపోచమ్మ తల్లి,శ్రీదర్బార్ మైసమ్మ తల్లి బోనాలు పండుగ సందర్భంగా భారతీయ జనతా పార్టీ అనుబంధ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి కుటుంబ సభ్యులతో కలసి అమ్మవార్లకు బోనాలు సమర్పించి దర్శనం చేసుకోవడం జరిగింది.

## బోనాల జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్

**ఉప్పల్,జూలై20(సూర్యరేఖ)** ఆషాడ బోనాల జాతరను పురస్కరించుకొని నాచారం డివిజన్ పరిధిలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ వి ఎస్ఎస్ ప్రభాకర్ సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమౌళి,డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్,రాజిరెడ్డి,గంధమల్ల గోపి, మొర నర్సింహారెడ్డి మరియు ఇతర నాయకులు ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలి




**అమ్మవారికి బోనం సమర్పించిన కార్పొరేటర్ బన్నాల గీత**

**ఉప్పల్,జూలై 20 (సూర్యరేఖ)** ఆషాడం మాసం బోనాల పండుగను పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ కుటుంబ సమేతంగా బ్యాంక్ కాలనీ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పించారు.అనంతరం గీతాప్రవీణ్ మాట్లాడుతూ ఆషాడ మాస బోనాల పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి బోనం సమర్పించడం జరిగిందని తెలుపుతూ అమ్మవారి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, అదేవిధంగా అమ్మవారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి కెసిఆర్,మాజీ మంత్రి కేటీఆర్ హరీష్ రావు,ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిల పై ఉండాలని కొని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ని శాలువాతో సత్కరించి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశం బాబున్న సందీప్ భూషణ్ శ్రీనివాస్ మనోజ్, రమేష్,శేఖర్ ప్రదీప్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు,కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి




**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)** అమ్మవారి ఆశీస్సులు,కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని రాజేంద్రనగర్ శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు.ఆషాఢ మాసం బోనాల జాతర సందర్భంగా శ్రీశ్రీశ్రీ బంగారు పోచమ్మ దేవాలయం ప్రేమావతి పేట్ ఆలయాన్ని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి,యూనివర్సిటీ విసి డాక్టర్ జానయ్య,లు అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ యేడాది పంటలు బాగా పండి వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకోవడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నిర్వాహాకులు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోల్కొండ రాజుకుమార్ ఎడ్లకాడి సూర్యం గోల్కొండ రత్నం గోల్కొండ ఉపేందర్ ఎడ్లకాడి చంద్రశేఖర్ లేవి రాజ్ ఎడ్లకాడి సుభాష్ బిఆర్ సుమన్ కవ్వగూడెం గౌతమ్ జనార్దన్ కాసారం మహేష్ గోల్కొండ నాని మంగలారం బాబురావు కోడూరి రాజు నడికూడ యాదయ్య నర్సింగ్ రావు సూర్య అంకిత్ అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు పూడూరి జితేందర్ రెడ్డి(ఉప్పల్ పిజెఆర్) జన్మదిన వేడుకలు




**ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,జూలై 20(సూర్యరేఖ)** ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పూడూరి జితేందర్ రెడ్డి(ఉప్పల్ పీజే ఆర్ )జన్మదిన వేడుకలు ఆదివారం ఉప్పల్ రామస్వామి ఫంక్షన్ హాల్ లో అభిమానులు నాయకులు కార్యకర్తల మధ్య ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిలుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్గిరి పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరై జితేందర్ రెడ్డిని ఘనంగా సత్కరించే కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...జితేందర్ రెడ్డి ప్రజాసేవలో ఉంటూ మరెన్నో పుట్టినరోజులు ఇలాంటివి జరుపుకోవాలని ఆకాంక్షించారు.పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జితేందర్ రెడ్డిని సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా సబ్జిమండి 103వ వార్షిక బోనాల మహోత్సవం..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై20(సూర్యరేఖ)**కార్వాన్ సబ్జిమండిలోని నల్లపోచమ్మ మాత మహంకాళి దేవి అమ్మవార్లకు 14 బస్తీల వాసులు కమిటీగా ఏర్పడి ప్రతి సంవత్సరం ఆషాడ మాసం చివరి ఆదివారం అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించడం ఒక ఆనవాయితీగా పాటిస్తున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని సబ్జిమండిలోని నల్లపోచమ్మ,మహంకాళి దేవి ఆలయాల ఆధ్వర్యంలో 103వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహినచ్చడం జరుగుతుందని ఉత్సవ కమిటీ అధ్యక్షులు దొర్తుల శ్రీనివాస్ తెలిపారు.పాలకసభ్యులు భక్తులు మహిళలు మహంకాళి ఆలయం నుండి సామూహికంగా బయలుదేరి నటరాజ్ నగర్ లోని నల్లపోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించారు. అమ్మవారి ఘటాన్ని ఏనుగు అంబారీపై సుందరంగా అలంకరించి,డప్పుల వాయిద్యాలతో జానపద కళాకారుల నృత్యాలూ,పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపును ఎంతో కన్నుల పండుగగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్ర.కార్యదర్శి కట్ట శ్రీనివాస్,కోశాదికారి గోపాల్ నలహోదారులు రాజయ్య,శివరత్నం,వేణు,శివరాజ్,వేణు,కట్ట నర్సింగరావు శ్యాంసుందర్,అశోక్ కుమార్,నిరంజన్,నందకిషోర్,పూజ కమిటీ సభ్యులు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## అమ్మవారి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి...

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ కుటుంబ**



**ఉప్పల్,జూలై 20(సూర్యరేఖ)**పవిత్ర ఆషాడ బోనాల జాతర సందర్భంగా నాచారం డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఘనంగా జరుపుకొని కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు.అమ్మవారి దివ్య కటాక్షములను పొంది అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ పవిత్ర ఆషాడ మాసంలో ఆ అమ్మవారికి బోనాన్ని సమర్పించి చేసుకునే బోనాల పండగను అందరు భక్తి శ్రద్దలతో చేసుకోసుకుని ఆ అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందుకోవాలని కొరారు.ఆ అమ్మవారి దివ్య కృపాకటాక్షలు దీవెనలు,ఆశీస్సులు నాచారం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలియజేశారు .

## శంషాబాద్-తిరుపతి స్పైస్‌జెన్ విమానంలో సాంకేతిక లోపం..




**శంషాబాద్,జూలై20(సూర్యరేఖ)**ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు విమాన ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయపడేలా చేస్తున్నాయి. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా ఘటన మరువక ముందే పలు విమానాలు సాంకేతిక సమస్యలతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అవుతున్నాయి. తాజాగా శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్‌జెట్ ఎస్‌జీ-2138 విమానంలో టెక్నికల్ ఇష్యూస్‌తో నిలిచిపోయింది.విమానం బయల్దేరడానికి ముందే సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ విషయాన్ని అధికారులకు చేరవేశారు.దీంతో సంస్థ ఆ సర్వీసును రద్దుచేసింది.అందులో తిరుపతి వెళ్లాల్సిన 54 మంది ప్రయాణికులను మరో విమానంలో పంపారు.దీంతో సాంకేతిక సమస్యను ముందుగానే గుర్తించడంతో పెను ప్రమాదమే తప్పిందని ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.అదే గాల్లో ఉండగా ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఎలా ఉండేదోనని అంటున్నారు.గత నెల 16న కూడా ఇదే సర్వీస్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది.హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లాల్సిన స్పైస్ జెట్ 2138 నంబర్ విమానంలో కాలిన వాసన రావడంతో విమాన సిబ్బంది అలర్ట్ అయ్యారు.టేకాఫ్ ముందే ఫ్లైట్‌ని ఎయిర్ పోర్టులో నిలిపివేసి చెక్ చేసారు.క్షణాల్లో గాల్లో ఎగరాల్సిన విమానం సాంకేతికలోపం కారణంగా ఎయిర్ పోర్టులో నిలిపివేయడంతో ప్రయాణికులు సుమారు మూడున్నర గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

# బోనాలను పురస్కరించుకొని అమ్మవారిని దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్




**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బోనాల పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలతో నైవేద్యాలు సమర్పించారు.తొట్టెలు,ఫలహార బండ్లు ఊరేగింపు వేడుకలు పోతరాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాలతో వేడుకలు సందడిగా సాగాయి.ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా రాజేంద్రనగర్ లోని శ్రీఈదమ్మతల్లి శ్రీభూ లక్ష్మమ్మ తల్లి,శ్రీమాత పోచమ్మ తల్లి దేవాలయాలు దర్శనం చేసుకుని తోటలో ఊరేగింపు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వై.శ్రీధర్ మాట్లాడుతూ. ప్రతి యేడాది అమ్మవారి ఆశీస్సులు ప్రజలతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఆషాఢ బోనాల వేడుకలని,పండుగను ప్రజలంతా కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ దేవాలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వైగాగోపాల్ వై.రామకృష్ణ కే.శ్రీధర్ కే.నాగేష్ కే.మురళీకృష్ణ మధుసూదన్ యాదవ్ ఈ. వేణుగోపాల్ గణేష్ నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




# హైదర్ గూడలో నిర్మాణంలో ఉన్న భవనం ఎక్కి యువకుడు హల్ చల్

మూడు గంటలు పోలీసులను ముప్పుతిప్పలు..
పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి అతనిని కిందికి దించారు..

**రాజేంద్రనగర్,జూలై20(సూర్యరేఖ)** నిర్మాణంలో ఉన్న భవనం ఎక్కిన ఓ యువకుడు కిందికి దూకుతానని మూడు గంటల పాటు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు.పోలీసులు చాకచక్యంగా అతన్ని మాటల్లో పెట్టి కిందకి దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించిన ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్ గూడ సిరిమల్లెనగర్ లో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. శంషాబాద్ మండలం ఘాన్సీ మియాగూడ కు చెందిన ఎల్లయ్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడు స్వగ్రామం నుంచి అత్తాపూర్ లోని సిరిమల్లె నగర్ కు వచ్చాడు.నిర్మాణంలో ఉన్న ఓ భవనంపైకి ఎక్కాడు.గోవ కట్టెల చివరి అంచున నిలబడి కిందకు దూకేస్తానని స్థానికులను బెదిరించాడు.వారు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.తన దగ్గరికి వస్తే కిందకు దూకేస్తానని ఎల్లయ్య బెదిరింపులకు పాల్పడ్డాడు. మూడు గంటల పాటు పోలీసులను,స్థానికులను ముప్పుతిప్పలు పెట్టాడు.ఎస్సై రఘు రంగంలోకి దిగి అతన్ని మాటల్లో పెట్టాడు.పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పైకి వెళ్లి అతనిని కిందికి తీసుకొచ్చారు. అనంతరం అతడిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి ఎల్లయ్యను కాపాడిన పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాఘవేంద్ర,అంజలయ్య,లేడీ కానిస్టేబుల్ ను స్థానికులు అభినందించారు.




# ఏడుపాయల దుర్గామాతను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు




**కొల్చారం,జులై20(సూర్యరేఖ)**ఏడుపాయల దుర్గామాతను మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారి పేర ప్రత్యేక పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అమ్మవారి కృప వల్ల జిల్లాలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవాలని రైతులు పాడిపంటలతో మరియు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో మెలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శ్రీనివాసరావు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర సత్యనారాయణ సత్కరించిన కార్పొరేటర్ దర్శన్..



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 20(సూర్యరేఖ)** జియాగూడ ఇమాంపుర నవభారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో,పోతురాజుల విన్యాసాలతో భారీ ఊరేగింపుతో పురాణ పూల్ నుండి 22 అడుగుల భారీ అమ్మవారి తోట్టెలను జీయగూడ లోని ఇమంపురా కమ్యూనిటీ హాల్ వద్దకు తీసుకువచ్చి పెట్టడం జరిగింది. పురాణపూల్ సర్కిల్లలో జియాగూడ కార్పొరేటర్ బోహిని దర్శన్ ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద భారీ తోట్టెలకు పూజలు నిర్వహించి నవ భారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా దర్శన్ మాట్లాడుతూ. అమ్మవారు అందరిని చల్లగా చూడాలని కోరారు.

## మోడీ క్యాంటీన్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ..

న్యాయవాది బిజెపి నాయకురాలు నల్లుల సంగీత





**బెల్లంపల్లి,జూలై20(సూర్యరేఖ)** బెల్లంపల్లి కాంట్రా చౌరస్తాలో న్యాయవాది,బిజెపి నాయకురాలు నల్లుల సంగీత ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ...మోడీ క్యాంటీన్ అంటే ప్రజాసేవ కోసమే అని,బీదవారికి విద్యార్థులకు అన్ని వర్గాల ప్రజలకు అండదండలుగా ఉండాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం మొదలుపెట్టామని తెలిపారు.భారత దేశం మోడీ అభివృద్ధి చూసి ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని,ఆ గొప్పతనం మోడీది అని,అందుకే మోడీ అంటే ప్రజల్లో అపార నమ్మకం అని ఈ సందర్భంగా వారు తెలిపారు. మోడీ క్యాంటీన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తామని ఆమె తెలిపారు.

## సిరూర్ ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు






**అందోల్,జులై20(సూర్య రేఖ) :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం సిరూర్ గ్రామంలో భక్తి శ్రద్దలతో ఆడపడుచులు నెత్తిపై బోనాలను ఎత్తుకొని శివశతుల పూనకాలతో పోతురాజుల విన్యాసాలతో కులమతాల కతీతంగా భక్తిశ్రద్ధలతో సోదరీ సోదరీమణులు గ్రామ శివారులో గల పోచమ్మతల్లి గుడి వద్దకు గ్రామం పురవీధుల గుండా భారీ ఊరేగింపుగా భాజాభాజంత్రీలతో,ఆటపాటలతో బోనాలు సమర్పించడం జరిగింది.అలాగే అక్కడ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి పేరుపేరునా బిఆర్ఎస్ పార్టీ గ్రామ యువ నాయకుడు షాపురం శివకుమార్ ముదిరాజ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పిల్లోడి మహేష్,పిల్లోడి అశోక్ అన్నదానం ఏర్పాటు చేశారు.

# వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండాలి కలెక్టర్








**కొల్చారం బీసీ సంక్షేమశాఖ వసతిగృహ నిర్వహణ తీరు ఇతర వసతి గృహాలకు ఆదర్శం..మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**కొల్చారం,జులై 20(సూర్యరేఖ)** వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థుల ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం కొల్చారం మండలం బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,స్టోర్ రూమ్, మెనూ,వసతి గృహంలో మరుగుదొడ్ల పరిశీలించారు.వసతి గృహ నిర్వాహన తీరును పర్యవేక్షించిన అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.వసతి గృహాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని,కొత్తగా చేరిన విద్యార్థులతో ఐకమత్యంగా మెలుగుతూ వారిని వసతి గృహానికి అలవాటయ్యే వరకు అధికారులు పర్యవేక్షించాలని,కొత్తగా చేరిన విద్యార్థులపై దృష్టి పెట్టి విద్యార్థులతో కలిసి పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని కల్పిస్తూ కొత్తగా చేరిన విద్యార్థుల పట్ల దృష్టి పెట్టాలన్నారు. ఆరోగ్యం తో పాటు పరిశుభ్రత నిర్వహణ నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటూ వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ప్రతినెల వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలన్నారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని అదేవిధంగా శానిటేషన్ చేపట్టి చెత్తను తొలగిస్తూ అహల్లాద కరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయా లన్నారు.కొత్త మెనూ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులతో సమీక్షించాలన్నారు. కలెక్టర్ వెంట బీసీ వసతి గృహ వార్డెన్ ఉమ,వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జూలై 20(సూర్యరేఖ)** ఆషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గం హబ్సిగూడ,ఉప్పల్,రామంతపూర్ డివిజన్ లోని గాంధీనగర్ రేణుక ఎల్లమ్మ,రామ్ రెడ్డి నగర్ రేణుక ఎల్లమ్మ,నల్ల పోచమ్మ దేవాలయం, ఉప్పల్ డివిజన్ లో లక్ష్మీనారాయణ కాలనీలో మల్లెల మైసమ్మ,బాల ఉప్పలమ్మ,శ్రీరమణపురం శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయలో అమ్మవారిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రఫిక్, టీపీసీసీ డెలికేట్ తోఫిక్ లోకాస్ సందీప్ వెంకటరెడ్డి, నాగేశ్వరరావు మధుబాబు సురేందర్ రెడ్డి,సుధాకర్ నాగరాజు బ్రహ్మాచారి కుమార్ ఆర్టిసి వేణు, శంకర్ బుల్లెట్ అశోక్ సచిన్ చింటూ, ప్రశాంత్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# నల్లంపల్లిలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**సమర్పించిన నల్లంపల్లి గ్రామప్రజలు**

**అందోల్,జులై20(సూర్య రేఖ) :** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నల్లంపల్లి గ్రామంలో పోచమ్మ తల్లికి ఆషాఢమాసం సందర్భంగా గ్రామ ప్రజలు బోనాల జాతరను నిర్వహించారు. పెద్దలు కులమతాలకతీతంగా సోదర సోదరీమణులు ప్రతి ఒక్కరూ ఇంటికొకరు బోనం ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో పోతురాజుల విన్యాసాలతో,డబ్బు చప్పులతో,పురవీధుల గుండా గ్రామంలోని పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలందరూ వారి వారి మొక్కులను చెల్లించుకున్నారు.ముఖ్య అతిథిగా డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్ మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఇలాగే అన్నదమ్ముల వలే కలిసిమెలిసి పండుగ నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని,గ్రామ ప్రజలకు పెద్దలకు యువకులకు సోదరసోదరీమణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అలాగే పోచమ్మ తల్లికి సిద్దన్న పాటిల్ మొక్కులు చెల్లించుకొని గ్రామంలో ని పాడిపంటలు బాగా పండి వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించారు.గ్రామ ప్రజలు పిల్లాపాపలతో సుఖసంతోషాలతో అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉండాలని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో రాయికోడు మండలం ఎస్సై నారాయణ ముదిరాజ్,పూజారి బోయిని ఆగమయ్య ముదిరాజ్,మాజీ సర్పంచ్ వినయ్ పటేల్,అలాగే దగ్గరుండి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించిన బోయిని శేఖర్ గ్రామ పెద్దలు యువకులు సోదర సోదరీమణులు భారీగా పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి

**ఘనంగా గాంధారి మైసమ్మ బోనాల జాతర**

**మొక్కలు చెల్లించుకున్న మంత్రి వివేక్**



**మందమర్రి,జులై 20(సూర్య రేఖ)** అమ్మ వారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర గనుల,కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు.ఆషాఢ మాసం చివరి ఆదివారం రోజున మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట జాతీయ రహదారి సమీపంలో గల గాంధారి మైసమ్మ బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు.డప్పు చప్పుళ్ళు,వాయిద్యాల నడుమ సుమారు 250 బోనాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో రాష్ట్ర కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొని అమ్మవారి బోనంను నెత్తిన ఎత్తుకొని మైసమ్మ ఆలయంలో సమర్పించారు.పోతురాజుల విన్యాసాలు,జోగినిలు భక్తి పారవశ్యంతో అమ్మవారికి బోనం సమర్పించారు.భక్తులు మంచిర్యాల జిల్లా నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి తెలంగాణ భూమి పరంపరగా శక్తి స్వరూపమైన గ్రామ దేవతల ఆరాధనలో ముందుంటోందని, ఇలాంటి భక్తి ఉత్సవాలు ప్రజల మానసిక శాంతికి,సామూహిక ఐక్యతకు పెద్ద వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఐక్యంగా ఉండి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంది సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ అమ్మవారికి పూజలు నిర్వహించి నట్లు తెలిపారు.తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతరను ప్రజలందరూ పాల్గొని సంప్రదాయాలను చాటుతున్నారన్నారు. అమ్మ వారి ఆశీస్సులతో రాష్ట్రాభివృద్ధి నిరంతరంగా సాగుతుందని ఆయన స్పష్టం చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక క్యూ లైన్,పలు సౌకర్యాలు కల్పించారు.జాతరలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా మంచిర్యాల డీసీపీ భాస్కర్,ఏసిపి రవికుమార్ ల సారథ్యంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో,సర్కిల్ రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు,మహిళా సంఘాలు ,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మాటూర్ గ్రామంలో ఘనంగా ఉరడమ్మ తల్లికి బోనాలు




**అందోల్,జులై20(సూర్య రేఖ)** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మాటూర్ గ్రామంలో ఉరడమ్మ తల్లికి ఆషాడ మాసం బోనాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు,పెద్దలు కులమతాలకతీతంగా బోనము ఎత్తుకొని శివసత్తుల పూనకాలతో పోతురాజుల విన్యాసాలతో డబ్బు చప్పులతో పురవీధుల గుండా గ్రామంలోని పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.అలాగే పత్రిక విలేఖరి మక్షుద్ కు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం ఇలాగే అన్నదమ్ముల వలే కలిసిమెలిసి పండుగ నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందని,గ్రామ ప్రజలకు పెద్దలకు,యువకులకు,సోదర సోదరీమణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పోచమ్మ తల్లికి మొక్కులు మొక్కుకొని ఆ దేవుడు గ్రామంలోని పాడిపంటలు బాగా పండి వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ ప్రజలు పిల్ల పాపలతో సుఖసంతోషాలతో అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉండాలని మొక్కుకోవటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ పండరి,సదశివపటేల్,లింగరాజు,మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, సున్నం నర్సింలు,వర్కింగ్ అధ్యక్షులు తిప్పరాజు మొగులన్న గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో బోనాల సందడి





**అమ్మవార్లను దర్శించుకున్న ప్రముఖులు..**
**అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి..**
**నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జులై20(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బోనాల పండుగ సందడి అంబరాన్నంటింది.పవిత్ర ఆషాఢ మాసం సందర్భంగా సర్కిల్ పరిధిలోని మహంకాళి పోచమ్మ తల్లి,నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవారి బోనాల జాతరతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు,రాజకీయ నాయకులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ పద్మశాలిపురం టీఎన్జీవోఎస్ కాలనీ ప్రేమావతిపేట్,బాబుల్ రెడ్డి నగర్,నేతాజీ నగర్ బుద్వేల్,అపోర్కె కాలనీ,పలు కాలనీలలో దేవాలయాలను నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సందర్శించి,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్,మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ పద్మశాలిపురం టీఎన్జీవోఎస్ కాలనీ ప్రేమావతిపేట్,బాబుల్ రెడ్డి నగర్,నేతాజీ నగర్ బుద్వేల్,అపోర్కె కాలనీ పలు కాలనీలలో దేవాలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారి కరుణకటాక్షాల తో ఈ యేడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పరిసరాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు కూడా అమలులో ఉన్నాయి. విద్యుత్ అలంకరణలు తాగునీటి సౌకర్యాలు ఆరోగ్య శిబిరాలు వంటి ఏర్పాట్లు భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పలు బస్తీలోని సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి,ఎల్వీ రెడ్డి పాండు శ్రీకాంత్ రెడ్డి అభి మల్లికార్జున్ శ్రీనాథ్ ఉత్తమ్ కిరణ్,సుమంత్ రాజవర్ధన్ రెడ్డి పాండురంగారెడ్డి సురేష్ ముదిరాజ్ చందు పవన్ వాసు రఘు ముదిరాజ్ సూర్యనారాయణ చింటూ నిఖిల్ రమేష్ రెడ్డి,వెంకటేష్ శంకర్ చక్రధర్ లక్ష్మణ్ సురేష్ రవి సురేష్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు స్థానిక యువకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మోరు గడ్డ అమ్మవారికి అంగరంగ బోనాల సమర్పణ




**మహంకాళి మాతకు వాడవాడల తొట్టెల ఊరేగింపులు..**
**పోతరాజుల వీరంగాలు కొటారు బండ్ల ప్రదర్శన..**
**బోనమెత్తిన పద్మక్క..**
**మహంకాళి మాతకు ఘనంగా పూజలు..**
**ఇసుక వేస్తే తరగని భక్తుల సందోహం..**

**రామాయంపేట,జూలై 21(సూర్యరేఖ)** చివరి ఆషాడ మాస రామాయంపేట అమ్మోరు గడ్డ మహంకాళి అమ్మవారి ప్రత్యేక ఉత్సవాలు, ఆదివారం బోనాల ప్రదక్షణ వాడ వాడల నుండి తొట్టెల ఊరేగింపులు పోతరాజుల విన్యాసాలతో కొటారు.బండ్ల ప్రదర్శనతో అమ్మవారికి భక్తులు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. రామాయంపేట పట్టణంలో దుర్గమ్మ బస్తి దుర్గా యువసేన,సగర సంఘం ఆధ్వర్యంలో గత 32 సంవత్సరాలుగా అమ్మవారికి తొట్టెల పోతరాజులతో గొర్రెపోతుల కొటారి బండ్లతో ఉత్సవాలు జరగడం, అమ్మవారికి సమర్పించడం జరిగింది.చిలుకల గల్లి నుండి దుర్గామాత సంగం ఆధ్వర్యంలో తొట్టెల కార్యక్రమం నిర్వహించారు.అక్కలగల్లీ నుండి ముదిరాజ్ సంఘం తుల్జాభవాని నిర్వాహక సంఘం ఆధ్వర్యంలో పోతరాజులు అమ్మవారికి తొట్టెలలు ఎంతో



ఆడంబరంగా నిర్వహించారు.దుర్గమ్మ బస్తి దుర్గా యువసేన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి బోనం ఎత్తింది. అనంతరం ఆమె మహంకాళి దేవాలయంలో భక్తితో పూజ నిర్వహించారు.

# మాజీ కౌన్సిలర్ దామెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా బెల్లంపల్లి 24వ వార్డులో బోనాల పండుగ





**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ యాదవ్**

**బెల్లంపల్లి,జూలై20(సూర్య రేఖ)** బెల్లంపల్లి 24 వ వార్డు మాజీ కౌన్సిలర్ దామర శ్రీనివాస్ ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టిపిసిసి ఓబీసీ స్టేట్ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్ యాదవ్,పూజలో పాల్గొని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరడం జరిగింది. అలాగే దామర శీను బస్తి ప్రజలు బండి ప్రభాకర్ యాదవ్ ని శాలువాతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 24 వార్డు ప్రజలు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆషాడ బోనాల సందర్భంగా చింతల్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు రావుల శేషగిరి




**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రావుల శేషగిరి ఆషాడ మాసం బోనాల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో చింతల్ డివిజన్ న్యూ లాల్ బహదూర్ నగర్ లో ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న లిబిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి తదితర నాయకులు

## నిజాంపేట్ శ్రీ కనక దుర్గా దేవి బోనాల పండుగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో నిజాంపేట్ ప్రజలు,నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు లిమాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీ కనక దుర్గా అమ్మవారి బోనాల పండుగలో పాల్గోని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు..అనంతరం వేదపండితుల ఆశీర్వచనల మధ్య అమ్మవారి ఆశీస్సులు పొందారు.. శివశక్తుల శిగాలు, పోతురాజుల నృత్యాలు విక్షించారు..ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఆషాడ మాస బోనాల పండుగకు నియోజకవర్గంలో అన్ని చోట్ల భారీ ఏర్పాట్లు జరిగాయాని కొనియాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవార్లనీ దర్శించుకుని సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.. తెలంగాణ ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, నియోజకవర్గంప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు..ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగంపాండు ముదిరాజ్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, బుచ్చి రెడ్డి, యువకిరణ్ రెడ్డి, శంకర్ యాదవ్, కోలన్ మహిపాల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్, సుధాకర్ 191 అధ్యక్షులు, శ్రీహర్ష, ఉదయ్, మూర్గేష్, భూపాల్ గౌడ్, సుధాకర్ రెడ్డి, పరమేష్, రవీందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి తో పాటు భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.


## ఆషాడ బోనాల సందర్భంగా అమ్మవారి దర్శించుకున్న జిల్లా గణేష్ నేత




**కుత్బుల్లాపూర్ :** ఆషాడమాస బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న జిల్లా గణేష్ నేత శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలో గల ఎల్లమ్మ, పోచమ్మ, మహంకాలమ్మ, మరెమ్మ, నాగమ్మ దేవాలయాల్లో నిర్వహించిన ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వాన మేరకు అమ్మవారి దర్శనం చేసుకొన్న సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆశిశులు మన అందరిపైన ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండేవిదంగా అమ్మవారి చల్లని చూపు మన అందరి పైన ఉండాలని వారు అన్నారు. మహేష్,సంగమేష్,రవీందర్, యాదగిరి శ్రీను, జనార్దన్, మల్లేష్, నాగరాజు,రవి వెంకటకృష్ణ రాజు నరేష్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**మా ముత్యాలమ్మ,పోచమ్మ, దుర్గామ్మా .. సల్లంగా చూడమ్మా.. మమ్మేల తల్లి.**



**కత్బుల్లాపూర్ :** కత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బోనాల పండుగ సందర్భంగా నిజాంపేట్ లోని వివిధ అమ్మవారి దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ , ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ,మాజీ కార్పొరేటర్ రవి కిరణ్ . ఈ సందర్భంగా నిజాంపేట్ 191 ఎన్టీఆర్ నగర్ ముత్యాలమ్మ తల్లి, ఇందిరమ్మ కాలనీ ఫేస్-3, ఇందిరమ్మ కాలనీ ఫేస్-1, రాజీవ్ గృహకల్ప ,సాయి నగర్ వివిధ ఆలయాలను దర్శించుకున్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయ వల్ల ప్రజలంతా సురక్షితంగా సుభిక్షంగా ఉండాలని అన్నారు.



# ‘భళ్లాలదేవ’ నేనే చేయాల్సింది.. అందుకే ఆ పాత్ర వద్దనుకున్నా: జయసుధ తనయుడు

హైదరాబాద్: సినీ ప్రేక్షకులను విశేషంగా అలరించిన చిత్రాల్లో ‘బాహుబలి’ ఒకటి. ప్రభాస్, రానా, అనుష్క, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్ కీలక పాత్రల్లో రూపొందిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఎస్.ఎస్.రాజమౌళి విజువల్ వండర్‌గానూ ప్రశంసలు అందుకుంది. ఇందులో ప్రతినాయకుడు భళ్లాలదేవుడి పాత్రలో రానా నటించి మెప్పించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పాత్ర కోసం నటి జయసుధ తనయుడు నిహార్ కపూర్‌ను కూడా చిత్ర బృందం ఎంపిక చేసిందట. రెండు, మూడు వారాల పాటు ‘బాహుబలి’ మూవీ కోసం శిక్షణ తరగతులకు కూడా హాజరైనట్లు నిహార్ తాజా ఇంటర్వ్యూలో పంచుకున్నారు. “మొదట భళ్లాల దేవుడి పాత్రను రానానే చేయాల్సింది. ఆయన డేట్స్ కుదరకపోవడం వల్ల నన్ను సంప్రదించారు. నేను ఓకే చెప్పాను. దాదాపు నాలుగు వారాలు ట్రైనింగ్ సెషన్స్‌లోనూ పాల్గొన్నా. ఆ తర్వాత ‘ఈ పాత్ర రానా చేస్తానని చెప్పారు. మీరు కాలకేయ పాత్ర చేస్తారా’ అని చిత్ర బృందం అడిగింది. నేను ఆలోచనలో పడ్డా. కాలకేయుడి పాత్రకు సంబంధించిన ఒక క్యారికేచర్ చూపించారు. పాత్ర డిజైనింగ్ ఇలా ఉంటుందని వివరించారు. ఎక్కువగా ప్రొస్థటిక్ మేకప్ వేశారు. ఇదే విషయాన్ని అమ్మ వద్ద ప్రస్తావిస్తే, ‘నీ మొదటి సినిమా ఫేస్ కూడా సరిగా కనిపించటం లేదు. బాడీ కూడా కవర్ అయిపోతోంది. ప్రేక్షకులు గుర్తించరు’ అని సలహా ఇచ్చారు. దాంతో చేయనని చెప్పా. ఆ పాత్రను నటుడు ప్రభాకర్ చేశారు. క్యారికేచర్‌తో పోలిస్తే, తెరపై ఆ పాత్ర పూర్తిగా మారిపోయింది. ఇది చిన్న విషయం కాకపోయినా ఆ పాత్ర చేయనందుకు నేనేమీ బాధపడలేదు. మొదటి నుంచి దర్శకుడు రాజమౌళినే అన్ని విషయాలు నాతో నేరుగా మాట్లాడారు. ఆ తర్వాత సరదాగా రమ్మని షూటింగ్‌కు రమ్మని పిలిస్తే, రెండుసార్లు వెళ్లాను” అని నిహార్ వివరించారు. ‘బాహుబలి’ విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మూవీ రెండు భాగాలను కలిపి ‘బాహుబలి: ది ఎపిక్’ పేరుతో ఒకే సినిమాగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. అక్టోబరు 31న ‘బాహుబలి: ది ఎపిక్’ను విడుదల చేయనున్నారు.

# కనీసం వాటర్ బాటిల్ పట్టుకెళ్లనివ్వండి



ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో థియేటర్ల పరిస్థితి దారుణంగా ఉంది. ఎంతో బాగుందనే టాక్ వస్తే తప్పితే కొత్త సినిమా చూసేందుకు జనాలు థియేటర్లకు వెళ్లట్లేదు. అయితే ఇలా జరగడానికి మరో కారణం కూడా ఉంది. ఇప్పుడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్‌కి అలాంటి అనుభవమే ఎదురైంది. ఈ మేరకు ట్వీట్ చేయడంతో సదరు విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మిగతా చోట్ల ఏమో గానీ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు చాలా థియేటర్లలో పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ రేట్లు కళ్లు చెదిరేలా ఉంటాయి. తాజాగా ఓ సినిమా చూసేందుకు థియేటర్‌కి వెళ్లిన నిఖిల్ కూడా తినుబండరాల ధరలు చూసి షాకయ్యాడు. తను కొన్న టికెట్ రేటు కంటే వీటికే ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చిందని ట్విటర్‌లో చెప్పుకొచ్చాడు. కనీసం వాటర్ బాటిల్ పట్టుకుని వెళ్లేందుకైనా అనుమతించాలని రిక్వెస్ట్ చేశాడు. ఈ విషయంలో డిస్ట్రిబ్యూషన్ సర్కిల్ కాస్త దృష్టి పెడితే బాగుంటుందని, అప్పుడే జనాలు థియేటర్లకు వస్తారని అన్నాడు. కొన్నిరోజుల ముందు నిర్మాత నాగవంశీ కూడా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇదే విషయమై తన అనుభవాన్ని బయటపెట్టారు. తలో రెండు పాప్ కార్న్, కూల్ డ్రింక్స్ ఏకంగా రూ.1000కి పైనే అయ్యాయని అన్నారు. దీంతో ఇప్పుడీ విషయం మరోసారి చర్చనీయాంశమైంది. ప్రస్తుతం టాలీవుడ్ నిర్మాతలు.. జనాలు థియేటర్లకు రావట్లేదని తెగ బాధపడిపోతున్నారు. అయితే కంటెంట్ విషయంలో దృష్టి పెట్టడంతో పాటు వీటి రేట్లు కూడా అందుబాటులో ఉంటేనే జనాలు కాస్తోకూస్తో రావడానికి ఆసక్తి చూపిస్తారు. లేదంటే మాత్రం పూర్తిగా ఓటీటీలకు అలవాటు పడిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.



# రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయల బహుమతి

గోల్డెన్ గ్లోబ్ అవార్డు విన్నర్ తెలంగాణ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. హైదరాబాద్ బోనాల పండుగ సందర్భంగా ఈ ప్రకటనను విడుదల చేసింది. ‘నాటు నాటు’ పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన అనంతరం ఈ పాట పాడిన రాహుల్ సిప్లిగంజ్‌పై పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా అతడు తెలంగాణ పాటలను ప్రోత్సహిస్తున్న సందర్భంగా ఈ నగదుని ప్రకటించింది ప్రభుత్వం.

# రావణుడిగా మా నాన్నను తప్ప ఎవరినీ ఊహించుకోలేను



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప అని అందరికీ తెలుసు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, శరత్ కుమార్ వంటి భారీ తారాగణంతో ఈ సినిమా తీశాడు. అందులో తనే కన్నప్ప పాత్రను పోషించాడు. మహాభారత్ సీరియల్ డైరెక్ట్ చేసిన ముకేశ్ కుమార్ ఈ చిత్రాన్ని అందంగా తెరకెక్కించాడు. జూన్ 27న విడుదలైన ఈ మూవీకి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. అయితే విష్ణు.. కన్నప్ప కంటే ముందు రామాయణాన్ని వెండితెరపై ఆవిష్కరించాలని ప్రయత్నించాడట! తాజాగా ఓ ఇంటర్వ్యూలో విష్ణు మంచు మాట్లాడుతూ.. రావణుడి పుట్టుక నుంచి చావు వరకు ఏమేం జరిగిందనే కథంతా నా దగ్గరుంది. దీనిపై సినిమా తీయాలని నేను గతంలోనే అనుకు న్నాను. ఈ ప్రాజెక్టులో సూర్య రాముడిగా నటిస్తే బాగుంటుందను కున్నాను. ఇదే విషయం గురించి మాట్లాడేందుకు 2009లో సూర్యను కూడా సంప్రదించాను. రాఘవేంద్రరావును డైరెక్టర్‌గా అనుకున్నాను. అయితే రాఘవేంద్రరావుకు నేను హనుమంతుడి రోల్ చేయడం ఇష్టం లేదు. ఇంద్రజిత్తుడి పాత్ర చేస్తే బాగుంటుందన్నారు. రావణుడి పాత్ర మా నాన్న పోషించాల్సింది. స్క్రిప్టు.. డైలాగులు అన్నీ పూర్తయ్యాయి, కానీ బడ్జెట్ సమస్య వల్ల సినిమా పట్టాలెక్కలేదు. భవిష్యత్తులో రామాయణ మూవీ చేస్తానో, లేదో కూడా తెలీదు! ఒకవేళ చేయాల్సి వస్తే మాత్రం రాముడిగా మళ్లీ సూర్యనే ఎంపిక చేసుకుంటాను. సీతగా ఆలియాభట్‌ను సెలక్ట్ చేస్తాను. రావణుడిగా మా నాన్నను కాకుండా ఎవరినీ ఊహించుకోలేను. హనుమంతుడి పాత్ర నేనే చేస్తాను. ఇంద్రజిత్తుగా సూర్య సోదరుడు కార్తీ, లక్ష్మణుడిగా కళ్యాణ్ రామ్, జటాయువుగా సత్యరాజ్ చేస్తే బాగుంటుంది అని విష్ణు చెప్పుకొచ్చాడు.

**భారీ బడ్జెట్‌తో బాలీవుడ్‌లో రామాయణ**

ప్రస్తుతం బాలీవుడ్‌లో రామాయణ సినిమా తెరకెక్కుతోంది. నితేశ్ తివారి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ కోసం దాదాపు రూ.4000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీంతో భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత ఖరీదైన చిత్రంగా రామాయణ నిలిచింది. ఈ మూవీ మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి రిలీజ్ చేయనున్నారు.



# పవన్ సినిమాలో రాశీ ఖన్నా?

టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథానాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు సమాచారం. అయితే ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ‘గబ్బర్ సింగ్’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,